బుధవారం
06-07-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 15
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

బీజేపీతో

తీవ్ర ముప్పు

మోదీ పాలనలో రాజ్యాంగ వ్యవస్థలు విచ్ఛిన్నం

మాట్లాడుతున్న నారాయణ, వేదికపై రామకృష్ణ, జంగాల

హాజరైన రాష్ట్ర సమితి సభ్యులు

- సీబీఐతో కక్ష సాధింపు చర్యలు
- వామపక్ష ఐక్యత పెంపొందాలి
- ప్రగతిశీల ఉద్యమాలు పెరగాలి
- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ
- రాష్ట్ర సమితి సమావేశాలు ప్రారంభం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:
మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం ప్రమాదకర శక్తిగా మారిందనీ, రాజ్యాంగ వ్యవస్థలను గుప్పెట్లోకి తీసుకుని కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ విమర్శించారు. సీపీఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి సమావేశాలు మంగళవారం విజయవాడ దాసరిభవన్‌లో జంగాల అజయ్‌కుమార్ అధ్యక్షతన ప్రారంభమయ్యాయి. నూతనంగా ఎన్నికైన వివిధ జిల్లాల పార్టీ కార్యదర్శులను పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ సమితి సభ్యులకు పరిచయం చేశారు. సీపీఐ రాష్ట్ర మహాసభల్లో చర్చించాల్సిన అంశాల్ని, వర్తమాన, భవిష్యత్ ఉద్యమాల నివేదికను, కార్యదర్శి నివేదికను రామకృష్ణ ప్రవేశపెట్టారు. గత సమితి సమావేశం నుంచి ఇప్పటి వరకు వివిధ జిల్లాల్లో మరణించిన పార్టీ నేతలకు సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి సంతాప తీర్మానం ప్రవేశపెట్టగా, సమావేశం రెండు నిమిషాలు మౌనం పాటించింది. అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయాలపై నారాయణ ప్రసంగించారు. బీజేపీ, ఆరెస్సెస్‌తో దేశానికి తీవ్రప్రమాదం పొంచి ఉందని నారాయణ హెచ్చరించారు. ప్రధాని మోదీని దేశాధినేతగా బీజేపీ ప్రచారం చేస్తోందని, దానిని ప్రజలంతా తిప్పికొట్టాల్సిన అవసరముందన్నారు. సీపీఐని మరింత బలోపేతం చేయాలని పార్టీ శ్రేణులకు ఆయన సూచించారు. వామపక్ష ఐక్యతను పెంపొందించుకోవాలని, ప్రగతిశీల శక్తులు, వ్యక్తులు, ప్రజాస్వామ్యవాదులను కలుపుకొని మరిన్ని పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. బీజేపీ కనుసన్నల్లో సీబీఐ నడుస్తోందని, వివిధ రాష్ట్రాల్లో బీజేపీని వ్యతిరేకించే రాజకీయ పార్టీలు, నేతలపై కేసులు పెడుతూ, లొంగ దీసుకుంటోందని, ఎదురించిన వారిని జైళ్లకు పంపుతోందని నారాయణ విమర్శించారు. బీహార్ ఎన్నికలు జరుగుతున్న వేళ హడావుడిగా ఆర్బీఐ ద్వారా ఆర్థిక సాయాన్ని మోదీ ప్రకటించారని గుర్తు చేశారు. రాజ్యాంగ సంస్థలను మోదీ విచ్ఛిన్నం చేస్తున్నారని, మోదీ వల్ల రాజ్యాంగానికి ప్రమాదం పొంచి ఉందన్నారు. రాష్ట్రాలపైనా కేంద్రం ఆర్థిక పెత్తనం చెలాయిస్తోందనీ మండిపడ్డారు. డబుల్ ఇంజన్ పేరుతో కేంద్రంలోనూ,

- మిగతా 2 లో



కృష్ణా ప్రాజెక్టులపై
మళ్లీ కిరికిరి

- ప్రకాశం బ్యారేజీ దిగువ ఆనకట్టలు, పంప్డ్ స్టోరేజీలకు అడ్డుకట్ట
- కేఆర్ఎంబీకి తెలంగాణ ప్రభుత్వం ఫిర్యాదు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:
కృష్ణా నదీ జలాల వివాదం ఉభయ తెలుగు రాష్ట్రాల మధ్య ముగిసేలా కానరావడం లేదు. నదీ తీరాన ఎగువ నుంచి దిగువ ప్రాంతం వరకు చిన్నపాటి ఎత్తిపోతల పథకం ఏర్పాటుకు ఏపీ ప్రభుత్వం ప్రయత్నించినా తెలంగాణ ప్రభుత్వం కేఆర్ఎంబీకి ఫిర్యాదు చేస్తూ తరచూ అడ్డుపడుతోంది. తాజాగా విజయవాడ ప్రకాశం బ్యారేజీ దిగువున రెండు ఆనకట్టల నిర్మాణానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేసిన ప్రతిపాదనలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ కృష్ణా నదీ యాజమాన్య బోర్డుకు తెలంగాణ ప్రభుత్వం ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేఆర్ఎంబీ చైర్మన్‌కు తెలంగాణ ఈఎన్సీ మురళీధర్ రెండు లేఖలు రాశారు. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం ప్రకారం అపెక్స్ కౌన్సిల్, కృష్ణా నదీ యాజమాన్య బోర్డు అనుమతి లేకుండా కొత్త ప్రాజెక్టులు చేపట్టడానికి వీల్లేదని లేఖలో పేర్కొన్నారు. ఎలాంటి అనుమతుల్లేకుండా ఏపీ ప్రభుత్వం కృష్ణానదిపై ప్రకాశం బ్యారేజీ దిగువన రెండు ఆనకట్టల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించడం సరికాదని అభ్యంతరం తెలిపారు. దీనిని తక్షణమే నిలువరించాలని కోరారు. కృష్ణా జలాలపై ఆధారపడి పంప్డ్ స్టోరేజీ స్కీమ్‌లను

- మిగతా 2 లో

పెరిగిన నిరుద్యోగం

- దేశం మొత్తం మీద జూన్‌లో 7.80 శాతానికి పెరుగుదల
- 8.03 శాతానికి ఎగబాకిన గ్రామీణ నిరుద్యోగం

న్యూఢిల్లీ:
భారతదేశం మొత్తం నిరుద్యోగిత రేటు మేలో 7.12 శాతం నుంచి జూన్‌లో 7.80 శాతానికి పెరిగింది. సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సీఎంఐఈ) నుంచి వచ్చిన గణాంకాల ప్రకారం, నిరుద్యోగిత రేటు పెరగడానికి ప్రధానంగా గ్రామీణ నిరుద్యోగం పెరుగుదల కారణంగా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాల గరిష్ఠ క్షీణత నమోదయింది. గ్రామీణ భారతదేశంలో నిరుద్యోగిత రేటు జూన్‌లో 8.03 శాతానికి పెరిగింది. ఇది అంతకు ముందు నెలలో 6.62 శాతంగా ఉంది. ఇది గత నెలలో పట్టణ నిరుద్యోగ రేటు క్షీణతను మేలో 8.21 శాతం నుంచి 7.30 శాతానికి భర్తీ చేసింది. గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే, నగరాల్లో ఎక్కువ అవకాశాలు సంవత్సరం ప్రారంభం నుంచి విస్తృత ధోరణిని నొక్కిచెప్పింది. ఈ నెలలో సుమారు 13 మిలియన్ల మంది ఉద్యోగాలు కోల్పోయారని, మిగిలిన వారు శ్రామిక శక్తి నుంచి నిష్క్రమించడంతో నిరుద్యోగుల సంఖ్య కేవలం 3 మిలియన్లు మాత్రమే పెరిగిందని సీఎంఐఈ మేనేజింగ్ డైరెక్టర్ మహేష్ వ్యాస్ అభిప్రాయపడ్డారు. ఈ సంకోచం, శ్రామిక శక్తి భాగస్వామ్య రేటును గత రెండు నెలల్లో 40 శాతం

- మిగతా 2 లో

ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా

ఖైదీలకు ఊరట

కేంద్ర ప్రభుత్వం యోచన

న్యూఢిల్లీ:
ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ఖైదీలకు ఉపశమనం కల్పించాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తోంది. 50ఏళ్లు దాటిన వేలాది మంది మహిళలు, ట్రాన్స్‌జెండర్లకు, 60 ఏళ్లు దాటిన పురుషులు.. సత్ప్రవర్తన కలిగిన ఖైదీలకు జైలు నుంచి విముక్తి ప్రసాదించనుంది. దేశం 75 ఏళ్ల స్వాతంత్ర్య వేడుకలను ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ పేరుతో జరుపుకొంటున్న విషయం విదితమే. తాజా పథకం 60 ఏళ్లు పైబడిన పురుషులకు, దివ్యాంగులైన ఖైదీలకు వర్తిస్తుంది. ఇలా ఉపశమనానికి అర్హత కావాలంటే శిక్షలో సగం పూర్తి చేసి ఉండాలన్న షరతును ప్రభుత్వం విధించనుంది. శిక్షాకాలం పూర్తి అయి జరిమానా కట్టలేక జైల్లోనే ఉన్న వారికి జరిమానాను మాఫీ చేసి

- మిగతా 2 లో

భారీ వాణిజ్య లోటు

- జూన్‌లో 25.63 బిలియన్ డాలర్లకు పెరుగుదల
- రూపాయిపై పెరుగుతున్న ఒత్తిడి

2లో

ఐద్రోజులు జోరు వానలు

రెండు శాతానికి తగ్గిన వర్షలోటు

నైరుతి రుతుపవనాలు జోరందుకున్నాయి. ఖరీఫ్ సమయానికి మధ్యభారతానికి జోరు వానలను తీసుకు వచ్చింది. ఈ మేరకు వాతావరణ శాఖ మంగళవారం వెల్లడించింది.

2లో

విద్యతోనే పేదరిక నిర్మూలన

- విద్యార్థులకు చదువే ఆస్తి
- విద్యారంగం రూపురేఖలు మారుస్తున్నాం
- 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు ఇస్తాం
- విద్యాకానుక పంపిణీ సభలో ముఖ్యమంత్రి జగన్

విద్యార్థులకు చదువే ఆస్తి అని, చదువు ద్వారానే పేదరికాన్ని పారదోలవచ్చని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు.

2లో

కార్పొరేషన్‌లకు నిధులేవి?

- సంక్షేమాన్ని విస్మరించడమే రాజన్న రాజ్యమా?
- చేతివృత్తిదారుల ఆగ్రహం
- సమాఖ్య అధ్వర్యాన రాష్ట్రవ్యాప్త ధర్నాలు
- సీఎం స్పందించకుంటే ఆందోళన ఉధృతం రామాంజనేయులు, చలపతి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:
వృత్తుల కార్పొరేషన్‌లకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే నిధులు కేటాయించాలని, చేతి వృత్తిదారులకు ఆయా కార్పొరేషన్‌ల ద్వారా సబ్సిడీ రుణాలు అందజేసి ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా సంక్షేమ కార్పొరేషన్‌ల ఎదుట

- మిగతా 2 లో

ఎన్టీఆర్ జిల్లా డీఆర్వోకు వినతి పత్రం అందజేస్తున్న రామాంజనేయులు, వెంకటరావు తదితరులు

ఇదీ లోకం!

నాటోలోకి ఫిన్లాండ్, స్వీడన్

చేర్పింపు ప్రక్రియ షురూ

బ్రసెల్స్ : ఉక్రెయిన్, రష్యా యుద్ధంతో నాటోలో చేరనున్నట్లు స్వీడన్, ఫిన్లాండ్ దేశాలు ప్రకటించిన క్రమంలో రెండు దేశాల చేర్పింపునకు సంబంధించి ప్రక్రియను అధికారికంగా నాటో మంగళవారం ప్రారంభించింది. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం నేపథ్యంలో ఇదొక చరిత్రాత్మక చర్య అని నాటో చీఫ్ జెన్స్ స్టోల్టెన్‌బర్గ్ అన్నారు. ఈ రోజు ఫిన్లాండ్, స్వీడెన్‌తో పాటు నాటోకూ శుభదినమని ఆయన ఆ రెండు దేశాల విదేశాంగ మంత్రులతో కలిసి నిర్వహించిన సంయుక్త విలేకరుల సమావేశంలో అన్నారు. సభ్యదేశాల సంఖ్య 32కు పెరిగింది. నాటో మరింత బలోపేతం అయిందని చెప్పారు. తమ వారికి మరింత రక్షణ లభిస్తుందని, ముఖ్యంగా దశాబ్దాల్లో లేనంతగా భద్రతా సంక్షోభాన్ని ఎదుర్కొంటుండటాన్ని ప్రస్తావించారు.

స్వీడెన్, ఫిన్లాండ్ దేశాల చేరికకు సంబంధించి పత్రా లపై 30 సభ్యదేశాల రాయబారు లు సంతకాలకు ముందు నిర్వహించిన సభలో నాటో ప్రధాన కార్యదర్శి మాట్లాడారు. కాగా, మా చేరికకు మిత్రదేశాల నుంచి మద్దతు లభించినందుకు కృతజ్ఞులం అని స్వీడెన్ విదేశాంగ మంత్రి ఆన్ లిండె అన్నారు. ఈ క్రమంలో ఎదురైన అడ్డంకులను గుర్తుచేసుకున్నారు.

ఇటలీలో అత్యవసర పరిస్థితి

70 ఏళ్లలో లేనంత నీటి ఎద్దడి

రోమ్ : ఇటలీలో 70 ఏళ్లలో లేనంత నీటి ఎద్దడి వల్ల వ్యవసాయంతో పాటు విద్యుత్ సరఫరాపై ప్రభావం తీవ్రంగా పడింది. అధిక ఉష్ణోగ్రతల వల్ల పరిస్థితి మరింత దారుణమైంది. దీంతో ఐదు ఉత్తర, మధ్య ప్రాంతాల్లో అత్యవసర పరిస్థితిని ఆ దేశ ప్రభుత్వం ప్రకటించింది. దేశంలోని అతిపెద్ద నది పో నీటిస్థాయి 70ఏళ్ల కనిష్ఠానికి చేరుకుంది. ఐదు ఉత్తర ప్రాంతాలైన ఎమిలియా రోమగ్న, ఫ్రూలీ వెంజియా గులియా, లొంబార్డీ, పీడమాంట్, వెనిటోల్లో ప్రత్యేక ఎమర్జెన్సీ ప్యాకేజీని ప్రభుత్వం ప్రకటించింది. నీటి కరవుతో 'పో' నది పరిసర ప్రాంతాలు బీడు భూములయ్యాయి. ఈ కొరతత వల్ల ఇటలీ వ్యవసాయ ఉత్పత్తుల్లో 30 శాతం దిగుబడి తగ్గనుంది. అనేక మున్సిపాల్టీల్లో నీటి వినియోగంపై అధికారులు ఆంక్షలు విధించారు. అధిక ఉష్ణోగ్రతలు, తక్కువ వర్షపాతంతో ఉత్తర ఇటలీలో నీటి ఎద్దడి ఏర్పడింది. పో నది తూర్పు దిశగా సుమారు 650 కిలోమీటర్ల దూరం ప్రవహిస్తుంది. ఇది ఉప్పునీటి నది కాగా పరివాహక ప్రాంతంలోని పంటలు నాశనం అవుతున్నట్లు రైతులు వాపోతున్నారు. పో నది చుట్టూ సారవంతమైన భూములు ఉన్నాయిగానీ నాలుగు నెలలుగా వాన లేక 40 శాతం మేర ఆహారోత్పత్తి జరుగుతోంది. బియ్యం, గోధుమలు దిగుబడి తగ్గింది. నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో 50 శాతం పశువులు అల్లాడుతున్నాయి. రోమ్‌లోని టైబర్ నది నీటిమట్టం తగ్గింది. లేక్స్ గార్డా, మగ్గియోర్‌లలోనూ ఇటువంటి పరిస్థితులే ఉన్నాయి. వాటి సాధారణ స్థాయి కంటే చాలా తక్కువగా ఉన్నాయి. జలవిద్యుత్ ఉత్పత్తికి నీటి కొరత ప్రధాసమస్యగా మారింది. పర్యవసానంగా విద్యుత్ కొరతలు దేశాన్ని అల్లాడిస్తున్నాయి. 20 శాతం ఉత్పత్తి చేసే చాలా సంస్థలు ఉత్తర పర్వత ప్రాంతాలలో ఉన్నాయి. ఫలితంగా జలవిద్యుత్ ఉత్పత్తి గణనీయంగా పడిపోయింది. ఈ క్రమవలో వ్యవసాయానికి 3 బిలియన్ యూరోలు అంటే 3.1 బిలియన్ డాలర్ల మేర కరవునిధిని మారియో డ్రాఘి ప్రభుత్వం కేటాయించింది. అలాగే, కరవు సహాయ నిధులుగా 36.5 మిలియన్ యూరోలు ప్రకటించింది. తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న వేళ నాటో సదస్సు నుంచి హుటాహుటి స్వదేశానికి ప్రధాని డ్రాఘి చేరుకున్నారు. పరిస్థితులను సమీక్షించి తగు నిర్ణయాలు తీసుకున్నారు. ఇదిలావుంటే, ఆదివారం భారీ మంచుకొండ విరిగి పడగా కనీసం ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. 26 మంది వరకు గాయపడ్డారు. ఈ ఘటనపై ప్రధాని దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. అసాధారణ / ఊహించని వాతావరణ పరిస్థితులే దీనికి దారి తీశాయని సోమవారం ఆల్ఫ్ పర్వత ప్రాంతాన్ని సందర్శించిన మారియో డ్రాఘి అన్నారు.

చికాగో - స్వాతంత్ర్య పరేడ్‌పై కాల్పులు

ఆరుగురి మృతి, 24 మందికి గాయాలు

చికాగో : అగ్రరాజ్యంలో కాల్పుల ఘటనలు కొనసాగుతూనే ఉన్నాయి. డెన్మార్క్ కాల్పుల ఘటన నుంచి తేరుకోక ముందే తాజాగా చికాగోలో తుపాకీ పేలింది. కాల్పుల్లో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. మరో 24 మంది గాయపడ్డారు. చికాగో సమీపంలోని హైలాండ్ పార్కులో స్వాతంత్ర దినోత్సవ పరేడ్ జరుగుతుండగా సమీపంలోని రీటెయిల్ట్ స్టోర్ పై నుంచి సాయుధుడైన ఓ వ్యక్తి కాల్పులకు తెగపడ్డాడు. దీంతో అక్కడున్న వారంతా భయంతో తలోదిక్కులో పరుగులు తీశారు. ఈ ఘటనకు సంబంధించి కొన్ని వీడియోలు, ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. చికాగోలోని సబర్బ్ లో కవాతు జరుగుతుండగా, ఒక దుండగుడు కాల్పులకు తెగబడ్డాడు. దీంతో అక్కడి వారు భయంతో పరుగులు పెట్టారు. మరికొందరు తూటాబారిన పడ్డారు. దుండగుడు ఒక దుకాణంపై నిలబడి కాల్పులు జరిపినట్లు భావిస్తున్నారు. వీధుల్లో కాల్పులు చెలరేగడంతో పరేడ్‌లో పాల్గొన్నవారు అకస్మాత్తుగా భయంతో పారిపోతున్నట్లు సోషల్ మీడియాలో ఒక వీడియో చక్కర్లు కొడుతుంది. కాల్పుల ఘటనను లేక్ కౌంటీ షెరీఫ్ కార్యాలయం ఒక ప్రకటనలో ధ్రువీకరించింది. ఎవరో కాల్పులు జరుపుతున్నాడు.. ఇక్కడ ఉండటం సురక్షితం కాదు అంటూ కొందరు పరుగులు తీశారు. పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఉదయం 10 గంటలకు కవాత్తు ప్రారంభమైన 10 నిమిషాలకు కాల్పులు జరిగినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ప్రజలు అటూ ఇటూ పరుగులు తీయడంతో పరేడ్ కోసం గుమ్మిగూడిన ప్రాంతంలో గందరగోళం నెలకొందని కొందరు చెప్పారు.

ఖైదీలకు ఊరట

(మొదటిపేజీ తరువాయి)

విముక్తి కల్పించాలని భావిస్తోంది. మరణశిక్ష, జీవితఖైదు పడిన వారికి, అత్యాచారం, తీవ్రవాద అభియోగాలు ఉన్న వారికి, వరకట్న చావులకు కారణమైన వారికి, మనీ లాండరింగ్ దోషులకు మాత్రం ఈ పథకం వర్తించదు. పేలుళ్ల, చట్టం, జాతీయ భద్రతా చట్టం, అధికారుల గోప్యతల చట్టం, హైజాకింగ్ నిరోధక చట్టం, అక్రమ మానవ రవాణా కేసుల్లో శిక్ష అనుభవిస్తున్న వారికీ వర్తించదని కేంద్ర హోంశాఖ ప్రకటించింది. అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని జైళ్లలో 4.78 లక్షల మంది ఖైదీలు ఉన్నారని, వాస్తవంగా జైళ్ల సామర్థ్యం 4.03 లక్షలేనని 2020 నాటి అధికారిక ప్రకటన వెల్లడించింది. మొత్తం ఖైదీల్లో లక్ష మంది మహిళలు ఉన్నట్లు తెలిపింది. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు కేంద్ర హోంశాఖ పంపిన సమాచారం ప్రకారం.. అర్హులైన ఖైదీలు మూడు దశల్లో విడుదలవుతారు. ఆగస్టు 15న మొదటి దశలో కొందరు, వచ్చే ఏడాది జనవరి 26న రెండో దశలో ఇంకొందరు, మూడో దశలో ఆగస్టు 15న మరికొందరు విడుదలవుతారు. నిరంతరం సత్ప్రవర్తన కలిగిన వారు, మూడేళ్లలో ఎలాంటి శిక్షపడని వారు అర్హులవుతారు. 50 ఏళ్లు పైబడిన మహిళలు, ట్రాన్స్‌జెండర్లు, 60 ఏళ్లు నిండిన పురుషులు, దివ్యాంగులను 75వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విడుదల చేసే అవకాశాలు ఉన్నట్లు హోంశాఖ వెల్లడించింది. సీనియర్ సివిల్, పోలీస్ అధికారులతో కూడిన రాష్ట్ర స్థాయి స్క్రీనింగ్ కమిటీ క్షుణ్ణంగా సదరు ఖైదీల వివరాలు పరిశీలించి పరిగణనలోకి తీసుకొన్న తర్వాతే ఎవరెవరికి జరిమానా మాఫీ చేయొచ్చు అన్నది ఆలోచిస్తామని పేర్కొంది. 18-21 ఏళ్ల మధ్య నేరస్తులపై ఇతర క్రిమినల్ కేసులు లేనిపక్షంలో, వారి శిక్షాకాలం 50 శాతం పూర్తయితే ఉపశమనం ఇచ్చేందుకు పరిగణనలోకి తీసుకుంటారని హోం శాఖ తెలిపింది. హోం శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి లేదా ప్రిన్సిపల్ సెక్రటరీ ఇంఛార్జి స్థాయి అధికారిని రాష్ట్రస్థాయి స్క్రీనింగ్ కమిటీ చైర్మన్‌గా, న్యాయ శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి లేదా ప్రిన్సిపల్ సెక్రటరీ ఇంచార్జిని సభ్య కార్యదర్శిగా నియమించాలని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు హోం శాఖ సూచించింది. ఈ కమిటీ ఖైదీల రికార్డులను పరిశీలించి ఉపశమనానికి, విముక్తికి అర్హులైన వారి జాబితా తయారు చేసి రాష్ట్ర ప్రభుత్వానికి సిఫార్సు చేస్తుంది. అలాగే కేంద్ర ప్రభుత్వం ఆమోదం అవసరం ఉన్న కేసులను హోంశాఖకు పంపుతుంది. శిక్ష అనుభవిస్తున్న విదేశీయులైతే విదేశీ వ్యవహారాల శాఖ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. ఆయా కేసుల వివరాలను హోం మంత్రిత్వ శాఖకు కూడా పంపాల్సి ఉంటుందని అధికారిక ప్రకటన పేర్కొంది.

పెరిగిన నిరుద్యోగం

(మొదటిపేజీ తరువాయి)

నుంచి 38.8 శాతం కనిష్ఠ స్థాయికి తగ్గించిందని ఒక పత్రిక కథనంలో పేర్కొన్నారు. ఉపాధిలో ఈ పదునైన పతనం, ప్రధాన శ్రామిక మార్కెట్ నిష్పత్తులలో సమానంగా తీవ్ర క్షీణత ఆందోళనకరంగా ఉన్నప్పటికీ, శ్రామిక మార్కెట్ క్షీణత దేశవ్యాప్తంగా విస్తృతంగా లేదని వ్యాస్ వివరించారు. వర్షాలు సాధారణం కంటే 32 శాతం తక్కువగా నమోదయ్యాయి. ఇది 'పొలాల్లోకి కార్మికుల విస్తరణ మందగించవచ్చు' అని ఆయన అన్నారు. రాబోయే వారాల్లో రుతుపవనాల వేగం పుంజుకోవడంతో కార్మికుల భాగస్వామ్యం మెరుగుపడుతుందని చెప్పారు. వ్యవసాయ రంగం జూన్‌లో దాదాపు 8 మిలియన్ల ఉద్యోగాలను తొలగించింది. ఎక్కువగా తోటలకు అనుసంధానించబడింది. ఏదేమైనప్పటికీ, పంటల సాగు 4 మిలియన్ల ఉద్యోగాలను జోడించింది. ఇది 2020-2021లో ఇదే కాలం కంటే తక్కువగా ఉందని వ్యాస్ తెలిపారు.

ఐద్రోజులు జోరు వానలు

న్యూఢిల్లీ : నైరుతి రుతుపవనాలు జోరందుకున్నాయి. ఖరీఫ్ సమయానికి మధ్యభారతానికి జోరు వానలను తీసుకు వచ్చింది. ఈ మేరకు వాతావరణ శాఖ మంగళవారం వెల్లడించింది. మధ్య భారతం, పశ్చిమ తీర ప్రాంతాల్లో రాగల ఐదు రోజుల పాటు జోరు వానలు కురుస్తాయని, వాయువ్యభారతంలో బుధవారం నుంచి వర్షాలు ఉంటాయని తెలిపింది. మధ్యప్రదేశ్‌లోని మధ్య భాగాలపై అల్పపీడన ప్రభావం ఉంటుందని, అనుబంధ తుపాను గుజరాత్ నుంచి మహారాష్ట్ర వరకు ద్రోణి కొనసాగుతుందని ఐఎండీ తెలిపింది. ఈ ప్రాంతాలతో పాటు తెలంగాణ, కేరళ, కోస్తా కర్ణాటక, ఒడిశా రాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తాయని భారతీయ వాతావరణ శాఖ వెల్లడించింది. రెండు రోజులుగా కురిసిన వర్షాలు వర్షలోటును గత శుక్రవారం ఉన్న ఎనిమిది శాతం నుంచి రెండు శాతానికి తగ్గించినట్లు పేర్కొంది. అయితే కొన్ని రాష్ట్రాల్లో వర్షలోటు కొనసాగినట్లు తెలిపింది. ఉత్తరప్రదేశ్‌లో (మైనస్ 48శాతం), జార్ఖండ్‌లో (మైనస్ 42శాతం), కేరళలో (మైనస్ 38శాతం), ఒడిశాలో (మైనస్ 26శాతం), మిజోరంలో (మైనస్ 25శాతం), మణిపూర్‌లో (మైనస్ 24శాతం), గుజరాత్‌లో (మైనస్ 22శాతం)గా ఉన్నట్లు ఐఎండీ డేటా ప్రకారం తెలుస్తోంది. ఇప్పటికే ఖరీఫ్ సాగు విస్తీర్ణం 278.72లక్షల హెక్టార్లుకాగా గతేడాది 294.42లక్షల హెక్టార్లలో పంట వేశారు. వ్యవసాయ శాఖ డేటా ప్రకారం ధాన్యాన్ని 43.45లక్షల హెక్టార్లలో వేయగా 2021లో అది 59.56లక్షల హెక్టార్లలో వేశారు. అంటే ప్రస్తుతం 16.11లక్షల హెక్టార్లు తగ్గింది. పప్పులను 28.06లక్షల హెక్టార్లలో వేయగా 2021లో 26.23లక్షల హెక్టార్లు అంటే 1.82లక్షలహెక్టార్లు ఎక్కువ. మొత్తంగా తృణధాన్యల సాగు విస్తీర్ణం 2021లో 50.36లక్షల హెక్టార్ల నుంచి 46.34లక్షల హెక్టార్లకు తగ్గింది.

మహిళల హవా

మొదటి 10 ర్యాంకుల్లో ఏడుగురు అమ్మాయిలే

2018 గ్రూప్-1 తుది ఫలితాల వెల్లడి

త్వరలో గ్రూపు-2 నోటిఫికేషన్: గౌతం సవాంగ్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ 2018 గ్రూప్-1 ఫలితాలు విడుదలయ్యాయి. ఏపీపీఎస్సీ చైర్మన్ గౌతమ్ సవాంగ్ మంగళవారం సాయంత్రం ఫలితాలు విడుదల చేశారు. మొత్తం 1.40 లక్షల మంది పరీక్షలు రాయగా, స్క్రీనింగ్ టెస్ట్‌కి 50వేల మందికి పైగా హాజరయ్యారు. 167 గ్రూప్ వన్ పోస్టులకిగాను 325 మంది ఇంటర్వ్యూలకి హాజరయ్యారు. ఫలితాల్లో పిఠాపురం ప్రాంతానికి చెందిన సుష్మితకు ప్రథమ ర్యాంక్ దక్కింది. వైఎస్సార్ జిల్లా కొత్తులగుట్టకు చెందిన శ్రీనివాసులుకు రెండో ర్యాంక్, హైదరాబాద్‌కు చెందిన సంజన సిన్హాకు మూడో ర్యాంక్ లభించింది. మొదటి పది స్థానాలలో ఏడుగురు మహిళలు ఉండటం గమనార్హం. కరోనాతో పాటు న్యాయపరమైన అంశాల వల్ల ఫలితాలు ప్రకటించడం ఆలస్యమైందని గౌతమ్ సవాంగ్ వెల్లడించారు. గ్రూప్-1 2018 నోటిఫికేషన్‌లో 167 పోస్టులకుగానూ 165 పోస్టులకు ఇప్పుడు ఫలితాలు వెల్లడించామని, వీటిలో 30 పోస్టులు డిప్యూటీ కలెక్టర్, 28 డీఎస్పీ పోస్టులు ఉన్నాయని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు ఈ నెల 12వ తేదీలోపు బోర్డు ముందు హాజరై.. హామీపత్రం ఇవ్వాల్సి ఉంటుందన్నారు. 2018 గ్రూప్-1 అభ్యర్థులు నాలుగేళ్లుగా ఫలితాల కోసం ఎదురుచూస్తున్నారు. 2020 డిసెంబరులో జరిగిన మెయిన్స్ పరీక్షలో 9,679 మంది పాల్గొన్నారు. డిజిటల్ విధానంలో వ్యాల్యూయేషన్ చేసి గతేడాది ఏప్రిల్‌లో ఫలితాలు విడుదల చేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు ఈ ఏడాది మాన్యువల్‌గా వ్యాల్యూయేషన్ చేసి మేలో ఫలితాలు విడుదల చేశామని సవాంగ్ తెలిపారు. హైకోర్టు ఆదేశాల మేరకు 165 గ్రూప్-1 పోస్టుల ఖాళీల భర్తీ కోసం ఇంటర్వ్యూలు పారదర్శకంగా పూర్తి చేశామని, మూడు బోర్డులు నియమించి పారదర్శకంగా గ్రూప్-1 ఇంటర్వ్యూలు నిర్వహించామన్నారు. నాలుగేళ్లపాటు జరిగిన నియామక ప్రకియను విజయవంతంగా పూర్తి చేశామన్నారు. హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను ఏపీపీఎస్సీ కచ్చితంగా అమలు చేసిందని చైర్మన్ వివరించారు. వచ్చే నెలలో 110 పోస్టులతో గ్రూప్-1, 182 పోస్టులతో గ్రూప్-2 నోటిఫికేషన్లు విడుదల చేస్తామని ప్రకటించారు. ఈనెల 24న దేవదాయశాఖలో ఈవో పోస్టులకు, 31న రెవెన్యూ శాఖలో జూనియర్ అసిస్టెంట్ పోస్టులకు రాత పరీక్ష ఉంటుందని వివరించారు. డిజిటల్ వ్యాల్యూయేషన్‌పై న్యాయస్థానంలోనూ విచారణ జరిగిందని, టెక్నాలజీ వినియోగంతో రాబోయే రోజుల్లో మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు. రాబోయే కాలంలో మరో 13 నోటిఫికేషన్లు ఉంటాయని, మొత్తంగా మరో రెండు వేల పోస్టులు భర్తీ చేస్తామని గౌతమ్ సవాంగ్ వెల్లడించారు.

విద్యతోనే పేదరిక నిర్మూలన

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు: విద్యార్థులకు చదువే ఆస్తి అని, చదువు ద్వారానే పేదరికాన్ని పారదోలవచ్చని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యాకానుక మూడవ విడత పంపిణీ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ఆదోని మున్సిపల్ హైస్కూల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసిన వైఎస్‌ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం సీఎం జగన్ మాట్లాడుతూ తాము అధికారం చేపట్టిన నాటి నుంచి విద్యపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. ఇంగ్లీషు విద్యను అభ్యసిస్తే ప్రపంచంలో ఎక్కడికైనా వెళ్లి బతకవచ్చనే గొప్ప ఆశయంతో ఇంగ్లీసు మాధ్యమాన్ని ప్రవేశపెట్టామని సీఎం చెప్పారు. విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తూ...నాడు-నేడు ద్వారా పాఠశాలల రూపురేఖలు మారుస్తున్నామన్నారు. డబ్బు లేనికారణంగా విద్యార్థులు చదువుకు దూరం కారాదన్న లక్ష్యం జగనన్న అమ్మఒడి ద్వారా తల్లుల ఖాతాల్లో రూ.15 వేలు వేస్తున్నామన్నారు. పేదరికం కారణంగా పిల్లలను చదివించలేని పరిస్థితి రాష్ట్రంలో ఉండరాదని తెలిపారు. కుటుంబంపై భారం పడకుండా విద్యార్థులకు పౌష్టికాహారం అందిస్తున్నామని, మెనూలో మార్పులు చేసి నాణ్యమైన ఆహారం అందిస్తున్నామని చెప్పారు. మెరుగైన విద్య అందించాలని బైజూస్‌తో ఒప్పందం కుదుర్చుకొని విద్యార్థులకు నాణ్యమైన విద్య లభించేలా కృషి చేస్తున్నామన్నారు. రేపటి తరం విద్యార్థుల భవిష్యత్‌పై దృష్టి సారించామన్నారు. జగనన్న విద్యాకానుక కింద ఒకటవ తరగతి నుండి 10వ తరగతి వరకు చదువుతున్న 47,40,461 మంది విద్యార్థులకు మూడోవిడతగా రూ.931 కోట్ల ఖర్చుతో బ్యాగులు, స్కూల్ డ్రెస్‌లు, బూట్లు, బెల్టు, టై, పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు అందిస్తున్నామన్నారు. 8వ తరగతి విద్యార్థులకు ఈ ఏడాది అక్టోబరులో 4.70 లక్షల మందికి 12 వేల ఖరీదు చేసే ట్యాబ్‌లు ఇస్తామన్నారు. ఉన్నత విద్య అభ్యసించే విద్యార్థులకు విద్యాదీవెన, వసతి దీవెన ద్వారా చదువుకునే అవకాశం కల్పిస్తున్నామన్నారు. మూడేళ్ల నుండి ప్రైవేట్ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులు చాలామంది ప్రభుత్వ పాఠశాలలకు వస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనూ కార్పొరేట్ విద్య అందించడానికి ప్రయత్నిస్తున్నామన్నారు. విద్యాశాఖమంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో 175 నియోజకవర్గాలలో డిగ్రీ కళాశాలల ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించేందుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో చేరుతున్న విద్యార్థుల సంఖ్య పెరిగిందన్నారు. ఆదోని ఎమ్మెల్యే సాయి ప్రసాద్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరావు ప్రసంగించారు.

అనంతరం విద్యార్థులకు కిట్లు పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించారు. మంత్రి గుమ్మనూరు జయరాం, ఎమ్మెల్యేలు బాలనాగిరెడ్డి, ఎర్రకోట కేశవరెడ్డి, కంగాటి శ్రీదేవి, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, ఎంపీ సంజీవకుమార్, ఆదోని మున్సిపల్ చైర్మన్ బోయ శాంత, మాజీ ఎంపీ బుట్టా రేణుక, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, వైసీపీ నాయకులు రుద్రగౌడ్, డీఈఓ రంగారెడ్డి, ఎస్పీ సిద్దార్థ కౌశల్ పాల్గొన్నారు.

ఆదోనిలో అప్రకటిత కర్ఫ్యూ: సీఎం పర్యటన సందర్భంగా పట్టణంలో అప్రకటిత కర్ఫ్యూ వాతావరణం నెలకొంది. పట్టణంలోని షాపులన్నీ మూయించారు. ప్రధాన రహదారికి రెండువైపులా బారికేడ్లు ఏర్పాటు చేశారు. రోడ్డుపై అనుమతి లేని వాహనాలు, వ్యక్తులు తిరగకుండా పోలీసులు అడ్డుకున్నారు. బారికేడ్లు ఏర్పాటు చేయడం వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆదోని పట్టణంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ముఖ్యమంత్రికి హెలిప్యాడ్ వద్ద ప్రజాప్రతినిధులు, అధికారులు ఘనస్వాగతం పలికారు.

కృష్ణా ప్రాజెక్టులపై మళ్లీ కిరికిరి

(మొదటిపేజీ తరువాయి)



చేపడుతోందని తెలంగాణ ప్రభుత్వం మరో లేఖ రాసింది. తెలంగాణ పరిధిలోని కృష్ణా బేసిన్‌లో తాగునీటి కొరత ఉండటంతో జాతీయ జలవిధానం ప్రకారం మొదట తాగునీటికి ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంటుందని గుర్తు చేసింది. జలవిధానం మేరకు తాగునీటి అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వకుండా కృష్ణా బేసిన్ వెలుపలకు పంప్డ్ స్టోరేజీ విద్యుత్, ఇతర అవసరాల కోసం నీటిని తరలించడం సరికాదని పేర్కొంది. సీడబ్ల్యూసీ, కృష్ణా బోర్డు, అపెక్స్ కౌన్సిల్ అనుమతి లేని పంప్డ్ స్టోరేజీ పథకాలను పరిశీలించాలని తెలంగాణ ప్రభుత్వం కోరింది.

భారీ వాణిజ్య లోటు

న్యూఢిల్లీ : భారతదేశం జూన్ వాణిజ్య లోటు రికార్డు స్థాయిలో 25.63 బిలియన్ డాలర్లకు విస్తరించింది. ముడి చమురు, బొగ్గు దిగుమతుల పెరుగుదలతో వాణిజ్య లోటు ఒక సంవత్సరం క్రితం 9.61 బిలియన్ డాలర్ల నుంచి 25.63 బిలియన్ డాలర్లకు పెరిగింది. ఇది రూపాయిపై మరింత ఒత్తిడికి దారితీసింది. ఉక్రెయిన్ యుద్ధం తర్వాత అంతర్జాతీయ ముడి చమురు, నిత్యావసర ధరలు పెరగడం, దేశీయ ఆర్థిక వ్యవస్థ పునరుద్ధరణకు ఆజ్యం పోసిన బొగ్గు, ఇతర వస్తువులకు డిమాండ్ పెరగడం, దిగుమతులు పెరగడంపై కేంద్ర ప్రభుత్వం ఆందోళన చెందుతోంది. భారతదేశం రూపాయి ఈ సంవత్సరం డాలర్‌తో పోలిస్తే 6 శాతానికి పడిపోయింది. డాలరు పుంజుకోవడం, దేశీయ షేర్ మార్కెట్ల నుంచి పెట్టుబడిదారులు వెనక్కి తగ్గడంతో రూపాయి విలువ తగ్గింది. ప్రైవేట్ ఆర్థికవేత్తల ప్రకారం జూన్‌లో సరుకుల వాణిజ్య లోటు అత్యధికంగా ఉంది. జూన్‌తో ముగిసిన ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో సరుకుల వాణిజ్య లోటు ఏడాది క్రితం కాలంలో 31.42 బిలియన్ డాలర్ల నుంచి 70.25 బిలియన్ డాలర్లకు రెండింతలు పెరిగిందని, జులై 4, 2022న వాణిజ్యం, పరిశ్రమల మంత్రిత్వ శాఖ విడుదల చేసిన ప్రాథమిక వాణిజ్య గణాంకాలు పేర్కొన్నాయి. వాణిజ్య లోటు పెరిగిన తర్వాత, ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో కరెంట్ ఖాతా లోటు మునుపటి త్రైమాసికంలో 13 బిలియన్ డాలర్ల నుంచి రెండింతలు పెరిగి 30 బిలియన్ డాలర్లకు చేరుకోవచ్చని రేటింగ్ ఏజెన్సీ మూడీస్ భారత విభాగం ఇక్రా ప్రధాన ఆర్థికవేత్త అదితి నాయర్ తెలిపారు. 'మిగిలిన 2022లో సరుకుల వాణిజ్య లోటు 20 బిలియన్ డాలర్ల కంటే ఎక్కువగా ఉంటుందని మేము ఆశిస్తున్నాము' అని ఆమె చెప్పారు. ఏదేమైనప్పటికీ, సేవల వ్యాపారంలో బలమైన మిగులు, 590 బిలియన్ డాలర్ల విదేశీ మారకపు నిల్వలు బయటి చెల్లింపులను నిర్వహించగలదనే విశ్వాసాన్ని ప్రభుత్వానికి అందించాయి. జులై 4, 2022న ఒక సీనియర్ ప్రభుత్వ అధికారి విలేకరులతో మాట్లాడుతూ, కరెన్సీ అస్థిరతను పరిష్కరించడానికి భారత రిజర్వు బ్యాంక్ ప్రయత్నాలు చేస్తున్నప్పుడు భారతదేశం 'మూలధన ప్రవాహాలపై ఎదురుగాలి'ని ఎదుర్కొంటోందని అన్నారు. జూన్ సరుకుల దిగుమతులు సంవత్సరానికి 51.02 శాతం పెరిగి 63.58 బిలియన్ డాలర్లకు చేరుకోగా, ఎగుమతులు 16.78 శాతానికి పెరిగి 37.94 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో మందగమనం ఎగుమతులను దెబ్బతీస్తోందని ఇంజినీరింగ్ ఎక్స్‌పోర్ట్స్ ప్రమోషన్ కౌన్సిల్ చైర్మన్ మహేష్ దేశాయ్ అన్నారు. అధిక వస్తువుల ధరలు, పెరుగుతున్న రవాణా ఖర్చులు కీలక ఆందోళనలుగా ఉన్నాయని పేర్కొన్నారు. 'ముందుకు వెళుతున్నప్పుడు, ప్రపంచ అనిశ్చితులు ఎంతకాలం కొనసాగుతాయనే దానిపై తదుపరి ప్రభావం తీవ్రత ఆధారపడి ఉంటుంది' అని ఆయన చెప్పారు.

బీజేపీతో తీవ్ర ముప్పు

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రాలలో ఒకే విధానం ఉండాలనే నియంతృత్వ ధోరణితో మోదీ ప్రభుత్వం నడుస్తోందన్నారు. మోదీ అధికారంలోకి వచ్చాక బొగ్గు సమస్య తీవ్రతరమైందని చెప్పారు. రాష్ట్రాలు తప్పనిసరిగా 10శాతం విదేశీ బొగ్గు కొనుగోలు చేయాలని ఆదేశించడం ద్వారా అదానీకి ఆయాచిత లబ్ధి చేకూరుస్తున్నట్లు నారాయణ చెప్పారు. ప్రభుత్వ రంగ సంస్థలను అదానీ, అంబానీకి నిస్సిగ్గుగా కట్టబెడుతోందని విమర్శించారు. తాజాగా ప్రభుత్వ వైద్యవ్యవస్థను అదానీకి కట్టబెట్టేందుకు నిర్ణయించిందన్నారు. మోదీ హయాంలో 24 ప్రభుత్వరంగ సంస్థలను అమ్మేశారని, కనీసం ఒక్క ప్రభుత్వ రంగ సంస్థనూ కొత్తగా ఏర్పాటు చేయలేదని నిందించారు. ఆర్థిక లావాదేవీలు బీజేపీ కనుసన్నల్లోనే కొనసాగుతున్నాయన్నారు. కాంగ్రెస్ చిల్లర స్థాయిలో అవినీతికి పాల్పడగా, బీజేపీ మాత్రం టోకుగా అవినీతికి పాల్పడుతోందని ఎద్దేవా చేశారు. ఎన్నికల కమిషన్, ఆర్‌బీఐ, సీబీఐ, న్యాయవ్యవస్థ తదితర రాజ్యాంగ వ్యవస్థలను బీజేపీ గుప్పెట్లో పెట్టుకుని ఆడిస్తోందని విమర్శించారు. ప్రశ్నించేవారిపైనా, ప్రత్యర్థులపైనా కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం బలంగా ఉన్నప్పటికీ మోదీని ప్రశ్నించే ధైర్యం లేకపోతోందన్నారు. ఈ మూడేళ్లలో రాష్ట్ర ప్రయోజనాల కోసం మోదీని ఒక్క అంశంలోనూ జగన్ నిలదీయలేకపోయారని విమర్శించారు. రాష్ట్రాలపై పెత్తనం చేసే చట్టాల ఆమోదానికి సైతం వైసీపీ మద్దతివ్వడం దుర్మార్గమన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ఓటు బ్యాంకుతో గెలిచినప్పటికీ జగన్ చివరికి మోదీకి మద్దతిస్తారని చెప్పారు. మోదీ-జగన్ బంధం రైలు పట్టాల్లాంటివనీ, వారిద్దరూ విడిపోరూ, కలవబోరనీ ఎద్దేవా చేశారు. చంద్రబాబు సైతం సీబీఐ కేసులకు భయపడి బీజేపీని వ్యతిరేకించే సాహసం చేయలేకపోతున్నారని చెప్పారు. రాష్ట్రంలో ఎన్నికల పొత్తులపై జరుగుతున్న చర్చను నారాయణ ప్రస్తావించారు. ఎన్నికల్లో ఏదైనా జరగవచ్చని అభిప్రాయపడ్డారు. ఎన్నికల పొత్తులు, సీట్ల పేరిట కాలయాపన చేయకుండా ఉద్యమాల బలోపేతంపై దృష్టి సారించాలని సీపీఐ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు పి.చంద్రానాయక్ అభ్యుదయ గీతాలు ఆలపించారు.

కార్పొరేషన్‌లకు నిధులేవి?

(మొదటిపేజీ తరువాయి)

ధర్నాలు నిర్వహించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఏడాది క్రితం ఏర్పాటు చేసిన 56 వృత్తుల కార్పొరేషన్‌లకు, పాలక వర్గ సభ్యులకు జీతభత్యాలు చెల్లిస్తూ కార్పొరేషన్‌లకు మాత్రం ఒక్క పైసా నిధులు కేటాయించకుండా ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని చేతి వృత్తిదారుల సమాఖ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామాంజనేయులు విమర్శించారు. చేతి వృత్తిదారుల సంక్షేమాన్ని విస్మరించి రాజన్న రాజ్యాన్ని ఎలా తీసుకొస్తారని ఆయన ప్రశ్నించారు. చేతివృత్తిదారుల సమాఖ్య పిలుపులో భాగంగా విజయవాడలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లోని డీఆర్వోకు చేతి వృత్తిదారుల సమాఖ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి తరపున కె.రామాంజనేయులు, ఉమ్మడి కృష్ణా జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్ధవరపు వెంకట్రావు, ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్.నాగసుబ్బారెడ్డి, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ఎన్. వెంకట శివ వినతిపత్రం సమర్పించారు. తనకు ఒక్క అవకాశం ఇస్తే రాజన్న సంక్షేమ రాజ్యం తెస్తానని అధికారంలోకి వచ్చిన జగన్..తన మూడేళ్ల పాలనాలో 30 రకాలకు పైగా చేతి వృత్తిదారులకు ఒరిగిందేమీ లేదని రామాంజనేయులు అన్నారు. నవరత్నాల్లోనూ రకరకాల నిబంధనలతో కోతలు విధిస్తున్నారని ఆయన మండిపడ్డారు. కరోనా కాలంలోనూ చేతి వృత్తిదారులను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. నూతన సాంకేతిక యంత్ర పరికరాలు కొనుగోలు చేయలేని నిస్సహాయ స్థితిలో ఉపాధి కోల్పోయి వృత్తిదారులు అర్ధాకలితో అలమటిస్తూ దుర్భర జీవితాలు గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చేతి వృత్తులపై ఆధారపడి జీవిస్తున్న వారంతా ఎక్కువగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ పేదలేనని, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేయకుండా తక్షణమే చేతి వృత్తుల, కులవృత్తుల కార్పొరేషన్‌లకు నిధులు కేటాయించాలని రామాంజనేయులు కోరారు.

కార్పొరేషన్లకు తక్షణమే నిధులు కేటాయించాలి: జింకా చలపతి

వృత్తిదారుల కార్పొరేషన్‌లకు తక్షణమే నిధులు కేటాయించాలని చేతి వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు జింకా చలపతి డిమాండ్ చేశారు. సమాఖ్య పిలుపు మేరకు సత్యసాయి జిల్లా కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి అనంతరం ఆర్డీవో వరప్రసాదరావుకు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం చలపతి మీడియాతో మాట్లాడుతూ సాంకేతికత ప్రభావంతో చేనేత, గీత, నాయీ బ్రాహ్మణ, వడ్డెర, రజక వంటి చేతివృత్తులు తీవ్ర సంక్షోభంలో కూరుకుపోతున్నాయని, చేతివృత్తులను నమ్ముకొని జీవనం సాగిస్తున్న కోట్లాదిమంది ఉపాధి తీవ్ర ప్రమాదంలో పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. వీరిని ఆదుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన 56 కార్పొరేషన్లు ఉపయోగపడతాయని ప్రజలు భావించారని, కానీ సీఎం జగన్ మాటలు కోటలు దాటాయి తప్ప చేతులు పొలిమేర దాటదన్నట్లు వీటికి నిధులు కేటాయించకుండా దిష్టిబొమ్మలుగా మార్చారని విమర్శించారు. చేనేత నాయకులు వెంకటనారాయణ, వెంకటస్వామి, రవికుమార్, చెన్నా భుజంగం, ఈశ్వరయ్య, శ్రీధర్, ఆదినారాయణ, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కర్నూలులో

చేతి వృత్తిదారులపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని, 56 బీసీ కార్పొరేషన్లు ఏర్పాటు చేసినప్పటికీ వాటికి నిధులు కేటాయించకపోవడం దారుణమని జిల్లా చేతి వృత్తిదారుల సమాఖ్య అధ్యక్షుడు మాధవస్వామి, కార్యదర్శి కారన్న విమర్శించారు. బీసీ కార్పొరేషన్ ఎదుట చేతివృత్తిదారులు ధర్నా నిర్వహించారు. అనంతరం సంక్షేమశాఖ అధికారికి వినతిపత్రం అందజేశారు. చేతివృత్తిదారుల సమాఖ్య జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు, చేనేత జిల్లా జిల్లా అధ్యక్షుడు సోమ మోహన్, ఎం రంగప్ప, వెంకటేశ్, కె.శ్రీనివాసులు, సీపీఐ నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కారుమంచి, అధ్యక్షుడు శ్రీనివాసులు, బిసన్న, డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి మహేశ్, ఏఐటీయూసీ నాయకులు రామాంజనేయులు, చంద్రకళ పాల్గొన్నారు.

నంద్యాలలో

చేతి వృత్తిదారులకు తక్షణమే రుణాలు మంజూరు చేసి ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ నంద్యాల జిల్లా రెవెన్యూ అధికారి పుల్లయ్యకు చేతివృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు సుబ్బయ్య వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సుబ్బరాయుడు, కార్యదర్శి సోమన్న, వ్యవసాయ కార్మిక సంఘం గోస్పాడు మండల అధ్యక్షుడు పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

అనంతపురంలో

కులవృత్తులు, చేతి వృత్తిదారులను ముఖ్యమంత్రి రోడ్డున పడేశారని, అణగారిన వర్గాల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారని చేతివృత్తిదారుల సమాఖ్య జిల్లా గౌరవాధ్యక్షుడు లింగమయ్య విమర్శించారు. చేతివృత్తిదారులు బీసీ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సమాఖ్య జిల్లా కార్యదర్శి హరికృష్ణ అధ్యక్షతన జరిగిన ధర్నాలో లింగమయ్య, చేతి వృత్తిదారుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు పెనకచర్ల బాలయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ బంగారు భాషా, శాలివాహన సంఘం నాయకులు వెంకట్, నారాయణ, హనుమంతు, నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు గోవిందరాజు, రవి, కొండయ్య, నారప్ప, గీత కార్మిక సంఘం నాయకులు ప్రసాద్, జయలక్ష్మి, మాజీ ఉప సర్పంచ్ లలితమ్మ, రఘు, మత్స్యకారుల సంఘం నాయకులు వెంకట్, భాస్కర్, కమ్మరి సంఘం నాయకుడు నార్పల సూరి, ఉప్పర సంఘం నాయకుడు జయరామ్, వడ్డెర సంఘం నాయకులు శీనన్న, వడ్డే శ్రీనివాసులు, చేనేత కార్మిక సంఘం నాయకులు సత్యనారాయణ, రజక వృత్తిదారుల సమాఖ్య నాయకులు నాగప్ప, నాగరాజు, పెయింటర్ భూషణ, సుబ్బరాయుడు, రాజు, రామాంజనేయులు, ఎస్టీ నాయకుడు వెంకటేశ్, మైనార్టీ నాయకుడు ఖాజా పాల్గొన్నారు.

ఎంఐజీ లే అవుట్‌లో 119 ప్లాట్ల కేటాయింపు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మధ్య తరగతి ఆదాయ వర్గాల ప్రజల అభ్యున్నతికి తోడ్పాటునందించే ఆలోచనతో ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఏపీసీఆర్డీఏ) అధ్వర్యంలో తాడేపల్లి-మంగళగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నవులూరులో ఏర్పాటు చేసిన జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్‌లోని ఎంఐజి లే అవుట్‌లో మొత్తం 119 మంది అర్హులైన వారికి ప్లాట్లను కేటాయించినట్లు ఏపీసీఆర్డీఏ కమిషనర్ వివేక్ యాదవ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఐజీ లే అవుట్‌లో ప్లాట్ల కోసం మొత్తం 147 మంది దరఖాస్తులు చేసుకోగా తొలి విడతలో 102 మంది అర్హులను ఎంపిక చేసి జూన్ 25న సంస్థ కార్యాలయంలో ప్రభుత్వ నిబంధనలను అనుసరిస్తూ ఆన్‌లైన్ రాండమ్ లాటరీ తీసి ప్లాట్ల కేటాయింపు ధ్రువీకరణ పత్రాలను అందజేశామన్నారు. తాజాగా మంగళవారం మరో 17 మంది అభ్యర్థులను ఎంపిక చేసి విజయవాడ లెనిన్ సెంటర్‌లోని సీఆర్డీఏ కార్యాలయంలో ఆన్‌లైన్ రాండమ్ లాటరీ తీసి ప్లాట్ల కేటాయింపు ధ్రువీకరణ పత్రాలను అందజేశామని ఆయన వెల్లడించారు. ఇందులో సాధారణ ప్రజలు 240 గజాల కేటగిరీలో 11 ప్లాట్లు, 200 గజాల కేటగిరీలో 6 ప్లాట్లను పొందారని తెలిపారు.

ఎంఐజీ రెండో ఫేజ్‌పై కసరత్తు

జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్‌లో 386 ప్లాట్లతో ఏర్పాటయిన ఎంఐజీ లే అవుట్‌లో ఇప్పటి వరకు 119 ప్లాట్లు కేటాయిం పులు జరిగాయి. ఫేజ్-2లో మిగిలిన 267 ప్లాట్లకు అతి త్వరలోనే దరఖాస్తులను ఆహ్వానిం చేందుకు సన్నాహాలు చేస్తున్నామని కమిషనర్ తెలిపారు. ఇ-లాటరీ ద్వారా ధ్రువీకరణ పత్రాలు పొందిన అభ్యర్థులు నెల లోపుగా అగ్రిమెంటు చేయించుకోవాలి. అగ్రిమెంటు చేసుకున్న నెలలోపు 30 శాతం వాయిదాను చెల్లించాలి. ఆరు నెలల లోపు మరో 30 శాతం నగదును చెల్లించాలి. ఏడాది లోపుగా మరో 30 శాతం వాయిదాను చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. మొదటి నెలలోనే మొత్తం వాయిదాను చెల్లించిన అభ్యర్థులకు 5 శాతం రాయితీ ఇవ్వటంతో పాటు ప్లాట్ రిజిస్ట్రేషన్‌లో ప్రాధాన్యం కల్పిస్తామని తెలిపారు. సీఆర్డీఏ ఎంఐజీ లే అవుట్‌లో ప్లాట్లు కొనుగోలు చేసిన వారికి భవిష్యత్తులో చక్కటి ప్రయోజనాలు ఉంటాయన్నారు. 60, 80 అడుగుల అనుసంధాన రహదార్లతో పాటు 40 అడుగులతో అంతర్గత సీసీ రహదార్లను కూడా నిర్మిస్తున్నా మన్నారు. వీటితో పాటు కాలిబాటలు, ఎస్టీపీలు, వర్షపు నీటి డ్రెయిన్లు, ఆహ్లాదాన్ని అందించే అందమైన ఉద్యానవనాలు, పచ్చదనం అభివృద్ధి, వీధి దీపాలు లాంటి ప్రజా జీవనానికి సౌకర్యవంతమైన పనులు చేపడుతున్నా మన్నారు. రానున్న రోజుల్లో ఏపీసీఆర్డీఏ పరిధిలోని 26 నియోజకవర్గాలలో జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్‌లు ఏర్పాటు చేసే దిశగా ముందుకు వెళుతున్నామన్నారు. ఇప్పటి వరకు ఆరు నియోజకవర్గాల పరిధిలో ఆయా జిల్లాల కలెక్టర్లు ప్రతిపాదనలు పంపగా వాటిని రాష్ట్ర స్థాయి కమిటీకి నివేదించామని తెలిపారు.

జెడ్పీ హైస్కూలులో ఐఏఎస్ పిల్లలు

విశాలాంధ్ర-విజయవాడ: ఐఏఎస్ అధికారి, ఏపీ శాప్ ఎండీ ప్రభాకర్ రెడ్డి తన ఇద్దరు పిల్లలను విజయవాడలోని పటమట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేర్పించారు. ప్రభాకర్ రెడ్డి సతీమణి లక్ష్మి మంగళవారం తన కుమారుడు, కుమా ర్తెను తీసుకుని పటమట జెడ్పీ హైస్కూలుకు వచ్చారు. కుమారుడిని ఆరో తరగతి, కుమార్తెను ఎనిమిదో తరగతిలో చేర్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెట్టడం వల్ల తమ పిల్లలను ఇక్కడ చేర్పించామని లక్ష్మి తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు, తరగతి గదులు, క్రీడా మైదానం అన్నీ చాలా బాగున్నాయని చెప్పారు. గతంలో ప్రభాకర్ రెడ్డి నెల్లూరు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పని చేసిన సమయంలో కూడా వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చదివించారు.

'ప్రత్యేక హోదా' ఇస్తే కేంద్రంతో కలుస్తాం: కోటగిరి శ్రీధర్

విశాలాంధ్ర-తిరుమల: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కి ప్రత్యేక హోదా ఇస్తే తాము ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు వైసీపీ ఎంపీ కోటగిరి శ్రీధర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. మంగళవారం శ్రీవారి దర్శనార్థం తిరుమలకు చేరుకున్న ఆయన దర్శనానంతరం మీడియాతో మాట్లాడారు. గత మూడు సంవత్సరాలుగా బీజేపీ బిల్లులన్నింటికీ మద్దతు పలుకుతున్నామని, ఇందులో దాపరికం ఏమీ లేదని తెలిపారు. రాబోయే రోజుల్లో సీఎం జగన్ మోహన్ రెడ్డి సారధ్యంలో ప్రత్యేక హోదా సాధించి రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతుందన్నారు. ప్రస్తుతం బీజేపీ ప్రభుత్వం నుంచి తమకు ఎలాంటి ఇబ్బంది లేదని, కేంద్రం నుంచి రావలసిన నిధులు అన్నింటిని రాబడుతున్నామని తెలిపారు. రెండు పార్టీలకు ఉన్న మంచి సంబంధాలే ఇందుకు కారణామన్నారు. తాను కుటుంబ సభ్యులతో కలసి శ్రీకాళహస్తి, అరుణాచలంతో పాటు తిరుమల శ్రీవారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందని ఎంపీ శ్రీధర్ అన్నారు.

ఈవోడీబీ 2020 ర్యాంకుల్లో ఏపీకి ప్రథమస్థానంపై

పరిశ్రమలశాఖ ఉన్నతాధికారులకు సీఎం ప్రశంస

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సులభతర వాణిజ్య రాష్ట్రాల ర్యాంకుల్లో (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్-ఈవోడీబీ)లో ఆంధ్రప్రదేశ్‌ని మొదటి స్థానంలో నిలిపిన పరిశ్రమల శాఖ ఉన్నతాధికారుల కృషిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అభినందించారు. మంగళవారం సీఎం క్యాంపు కార్యాలయంలో పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికాల వలవన్, ఏపీఈడీబీ ఎండీ సుబ్రమణ్యం జవ్వాది, పరిశ్రమల శాఖ డైరెక్టర్ సృజన తదితర ఉన్నతాధికారుల బృందం ముఖ్యమంత్రిని కలిసి ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ఏపీని ప్రథమ స్థానంలో నిలపడానికి కృషి చేసినందుకు దుశ్శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఏపీకి ప్రథమ స్థానం రావడానికి పరిశ్రమల శాఖాధికారులు చేసిన కృషే కారణమంటూ వారిని అభినందించారు. భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని వారికి సూచించారు. పూర్తి స్థాయి సర్వే ఆధారంగా 97.89 శాతంతో వరుసగా రెండో ఏడాది, 2020 ఈవోడీబీ ర్యాంకుల్లో మొదటి స్థానంలో నిలపడం పై సీఎం సంతోషం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రోత్సాహాన్ని స్ఫూర్తిగా తీసుకుని ఆయన విజన్ మేరకు ఆయా రంగాలలో గల అవకాశాలకు ప్రాధాన్యతనిస్తూ భవిష్యత్తులో మరింత కృషి చేస్తామని ఎండీ సుబ్రహ్మణ్యం తెలిపారు.

అగ్నిపథ్‌తో నిరుద్యోగ యువతకు నష్టం

రూ.2 కోట్ల ఉద్యోగాలేవీ?

ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితిలో తిరుమలై రామన్, రామకృష్ణ

మాట్లాడుతున్న రామకృష్ణ. వేదికపై తిరుమలై రామన్, రాజేంద్రబాబు, ఈశ్వరయ్య లెనిన్‌బాబు, పిచ్చయ్య

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన అగ్నిపథ్ పథకంతో నిరుద్యోగ యువతకు తీవ్ర నష్టం జరుగుతుందని, ప్రధాని మోదీ ఇచ్చిన ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాల భర్తీ నీటి మూటలుగా మారాయని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.తిరుమలై రామన్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి సమావేశాన్ని విజయవాడ దాసరి భవన్‌లో నిర్వహించారు. తిరుమలై రామన్, రామకృష్ణ మాట్లాడుతూ అగ్నిపథ్ పథకం పేరుతో త్రివిధ దళాలను, భద్రతా వ్యవస్థను నిర్వీర్యం చేసే విధంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి, నేడు అధికారంలోకి వచ్చి ఎనిమిదేళ్లు అయినా ఇంతవరకు ఒక్క ఉద్యోగమూ ఇవ్వలేదన్నారు. ఉద్యోగాలు అడిగితే పకోడీలు అమ్ముకోవాలంటూ నిరుద్యోగ యువతను హేళన చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ కంపెనీలకు అమ్ముతున్నారని, విభజన హామీలు అమలు చేయకుండా రాష్ట్ర పర్యటనకు మోదీ వచ్చి వెళ్లడం సిగ్గుచేటన్నారు.

ఎన్నికల సమయంలో ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేస్తామని, ప్రతి ఏటా ఉద్యోగాల పండుగ చేస్తానని చెప్పిన సీఎం జగన్ ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదని తెలిపారు. 25 పార్లమెంట్ స్థానాలు గెలిపిస్తే ప్రత్యేక హోదా సాధిస్తానని చెప్పిన జగన్, ఇవాళ మోదీ దగ్గర మోకరిల్లే పరిస్థితి ఏర్పడిందన్నారు. నిరుద్యోగుల పక్షాన ముందుండి పోరాడాలని పిలుపునిచ్చారు. సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్రబాబు అధ్యక్షత వహించగా, జాతీయ మాజీ కార్యదర్శి జి.ఈశ్వరయ్య, రాష్ట్ర కార్యదర్శి నక్కి లెనిన్‌బాబు, రాష్ట్ర ఆఫీస్ బేరర్లు ఎం.యుగంధర్, జి.నాగరాముడు, జి.సంతోశ్, కత్తి రవి, ఎంవీ సుబ్బారావు, వై.బాబీ, యూ.కారుమంచి, షేక్ సుభానితో పాటు 26 జిల్లాల నుంచి సభ్యులు పాల్గొన్నారు.

మురుగు కాల్వలో దిగి వైసీపీ ఎమ్మెల్యే కోటంరెడ్డి నిరసన

విశాలాంధ్ర-నెల్లూరు: నెల్లూరు గ్రామీణ నియోజకవర్గం పరిధిలోని ఉమ్మారెడ్డి గుంటలో వైసీపీ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మంగళవారం నిరసనకు దిగారు. మురుగు కాల్వ ఉన్న ప్రాంతంలో వంతెన నిర్మాణం చేపట్టాలని గత కొంతకాలంగా ఆయన డిమాండ్ చేస్తున్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇదే కాల్వలోకి దిగి నిరసన తెలిపారు. ఇప్పుడు తాము అధికారంలో ఉన్నప్పటికీ వంతెన నిర్మాణం జరగలేదని కోటంరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో మరోసారి కాల్వలో దిగి నిరసన తెలిపిన కోటంరెడ్డి... రైల్వే, నగర కార్పొరేషన్ అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్షమైనా, అధికారపక్షమైనా సమస్యల పరిష్కారంలో రాజీలేని పోరాటం చేస్తానన్నారు. ఎప్పటిలోపు పనులు ప్రారంభిస్తారో రాతపూర్వకంగా హామీ ఇవ్వాలని... అంతవరకు కాల్వ వద్ద నుంచి కదలబోనని స్పష్టం చేశారు. ఇచ్చిన గడువు లోపు సమస్య పరిష్కారం కాకపోతే మురుగునీటిలోనే పడుకుంటానని చెప్పారు. దీంతో అధికారులు ఈనెల 15న నిర్మాణ పనులు ప్రారంభించి వచ్చే నెల 15లోపు పూర్తిచేస్తామని లిఖితపూర్వకంగా హామీ ఇచ్చారు. అనంతరం కోటంరెడ్డి తన నిరసనను విరమించారు.

కవులు, కళాకారుల వర్క్‌షాప్‌కు సుద్దాల అశోక్‌తేజ

హైదరాబాద్: సీపీఐ రాష్ట్ర, జాతీయ మహాసభల గౌరవార్థం రెండు తెలుగు రాష్ట్రాల అరసం, తెలంగాణ ప్రజానాట్యమండలి అధ్వ ర్యంలో కవులు, కళాకారులు, రచయితల వర్క్‌షాప్ జరుగు తుంది. ఈ వర్క్‌షాప్‌కు ముఖ్య అతిథిగా సినీ గేయరచయిత డాక్టర్. సుద్దాల అశోక్‌తేజని ప్రజా నాట్యమండలి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహ మంగళవారం ఆయన నివాసంలో కలిసి ఆహ్వానించారు. జూలై 11 నుండి 13 వరకు జరిగే వర్క్‌షాప్‌లో ప్రజల పాటలు, కళాకారుల ప్రాముఖ్యత అనే అంశాలపై చర్చిస్తామని ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని మగ్దూంభవన్‌లో ఉదయం 10 గంటలకు వర్క్‌షాప్ ప్రారంభమవుతుందని, రెండు రాష్ట్రాల నుంచి కవులు, కళాకారులు, రచయితలు, ప్రముఖులు హాజరవుతారని వెల్లడించారు. వర్క్‌షాప్‌ను జయప్రదం చేయాలని రచయితలకు విజ్ఞప్తి చేశారు.

కాంగ్రెస్‌లోకి తీగల ?

మంత్రి సబిత కబ్జాదారు అంటూ ఫైర్

విశాలాంధ్ర - హైదరాబాద్: రంగారెడ్డి జిల్లాలో టీఆర్ఎస్ పార్టీ క్రమంగా పట్టు కోల్పోతుంది. గత కొన్ని రోజులుగా జరుగుతున్న పరిణామాలే ఇందుకు నిదర్శనం. జిల్లాకు చెందిన అధికార పార్టీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి ఏకంగా మంత్రి సబితా ఇంద్రారెడ్డిపై అవినీతి ఆరోపణలు చేసి సంచలనం సృష్టించారు. మహేశ్వరం నియోజకవర్గంలో భూ కబ్జాలను మంత్రి సబిత ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ భూములను స్వాహా చేస్తున్నారని, చివరకు చెరువులు, పాఠశాలల స్థలాలను కూడా వదలడం లేదంటూ మండిపడ్డారు. ట్రంక్ లైన్ పనులు ఇంకా పూర్తి చేయలేదని, టీఆర్ఎస్ పార్టీ నుంచి సబిత గెలవలేదని వ్యాఖ్యానించారు. మంత్రి అవినీతికి సంబంధించిన పూర్తి వివరాలను సీఎం కేసీఆర్‌కు అందిచనున్నట్టు పేర్కొన్నారు. ఇకపై సబితతో తాడో పేడో తేల్చుకుంటానని, ఇష్టానుసారంగా ఆక్రమాలను చూస్తు ఊరుకోనని పేర్కొన్నారు. అవసరమైతే ఆమరణ నిరాహారదీక్ష చేస్తానని హెచ్చరించారు. ఇదిలా ఉండగా తీగల ఆగ్రహం వెనుక ఆయన పార్టీ మారే ఉద్దేశంలో ఉన్నట్టు వార్తలు గుప్పుమన్నాయి. ఆయన ఈ నెల 11న కాంగ్రెస్ పార్టీలోకి చేరతారనే ప్రచారం ఊపందుకుంది.

మా బిడ్డల జీవితాలతో ఆటలా..

పాఠశాల విలీనం వద్దంటూ గ్రామస్థుల ధర్నా

విశాలాంధ్ర - గంగవరం: తమ గ్రామంలోని పాఠశాలను మరో పాఠశాలలో విలీనం చేయడాన్ని వ్యతిరేకిస్తూ చిత్తూరు జిల్లాలోని ఒక గ్రామ ప్రజలు ఆందోళన నిర్వహించారు. వివరాల్లోకి వెళితే చేశారు జిల్లాలోని గంగవరం మండలంలోని జరావారిపల్లిలో ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలను కీలపట్లలోని ఉన్నత పాఠశాలలో విలీనం చేయడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ గ్రామ పొలాల్లో ఏనుగులు, పులులు సంచరించడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. ఇటువంటి విపత్కర స్థితిలో తమ గ్రామంలో ఉన్న పాఠశాలను వేరే చోట విలీనం చేయడం తమ పిల్లల జీవితాలతో ఆటలాడడమేనని పేర్కొన్నారు. కీలపట్లలోని పాఠశాలకు వెళ్లాలి అంటూ కాలినడకన మూడు కిలోమీటర్లు నడిచివెళ్లాల్సి ఉంటుందని వాపోయారు. తమ బిడ్డల ప్రాణాలను పణంగా పెట్టలేమని పేర్కొన్నారు. తమ గ్రామంలోని పాఠశాలలో 170 మంది విద్యార్థులు ఉన్నారని తెలిపినా అధికారులు పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాల విలీనాన్ని రద్దు చేయాలని డిమాండు చేశారు.

టీడీపీ మద్దతు

పాఠశాల విలీనాన్ని టీడీపీ మండల అధ్యక్షులు సోమశేఖర్ తప్పుబట్టారు. గ్రామస్థుల ఆందోళనకు మద్దతు ప్రకటించారు. జరావారిపల్లి పాఠశాలను కీలపట్ల పాఠశాలలో విలీనం చేయడం సరికాదని పేర్కొన్నారు. గ్రామంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాల వారు అధికంగా ఉన్నారని, పాఠశాల విలీనంతో వారంతా చదువులకు దూరమవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. అడవి మార్గంలో నడిచి వెళ్లడం సాధ్యం కాదని ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండు చేశారు.

ఆగస్టు 14 నుంచి విశాఖలో అగ్నివీరుల ఎంపిక ప్రక్రియ

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: రాష్ట్రంలో 13 జిల్లాల అభ్యర్థులతోపాటు కేంద్రపాలిత ప్రాంతం యానాం అభ్యర్థులకు సైనిక నియామకాల్లో భాగంగా విశాఖలో అగ్నివీరుల పరీక్ష ర్యాలీ నిర్వహించనున్నారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి జిల్లా, పార్వతీపురం మన్యం, కాకినాడ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల అభ్యర్థులకు విశాఖలో ఎంపిక పరీక్షలు నిర్వహించనున్నట్లు రక్షణశాఖ వెల్లడించింది. ఆగస్టు 14 నుంచి 31 వరకు విశాఖ వన్‌టౌన్‌లోని ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంలో అగ్నివీరుల ఎంపిక ప్రక్రియ సాగుతుందని తెలిపారు.

ఈనెల 30వ తేదీలోగా సైనిక నియామక ఆన్‌లైన్ పోర్టల్‌లో అభ్యర్థులు పేర్లు రిజిస్ట్రేషన్ నమోదు చేసుకోవాలని రక్షణశాఖ అధికారులు తెలిపారు. ఆగస్టు ఏడో తేదీ నుంచి అడ్మిట్ కార్డులు ఆన్‌లైన్‌లో జారీ చేస్తామని, ఆర్మీ కాలింగ్ మొబైల్ యాప్ ద్వారా అభ్యర్థులు తమ సందేహాలు తీర్చుకోవచ్చని పేర్కొన్నారు. ఎలాంటి సందేహాలు ఉన్నా విశాఖ ఆర్మీ రిక్రూట్‌మెంట్ కార్యాలయం 0891 2756959 లో సంప్రదించాలని అధికారులు తెలిపారు.

అన్యాయంపై మాట్లాడితే దాడులా?

ఏపీలో తుగ్లక్ పాలన: అయ్యన్నపాత్రుడు

విశాలాంధ్ర -నర్సీపట్నం: అన్యాయంపై మాట్లాడే హక్కు రాజ్యాంగం కల్పించిందని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. తన స్వగృహంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లా డుతూ, తప్పు జరిగితే మాట్లాడే హక్కు అందరికి ఉంటుందన్నారు. ఒక ఐపిఎస్ అధికారి నిబంధనలకు విరుద్ధంగా తన ఇంటి ప్రహరీని దగ్గరుండి పడగొట్టించారన్నారు. కనీసం నోటీసు కూడా ఇవ్వలేదన్నారు. ఆర్టీసీ చార్జీలను రెండు సార్లు పెంచడం వల్ల ప్రజలపై రూ.2170 కోట్లు భారం పడిందన్నారు. ఇప్పటికే కరెంట్ చార్జీలు, డీజిల్, పెట్రోల్, నిత్యావసరాల ధరలు, ఇసుక రేట్లతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఆదాయం కోసం ప్రజలపై భారం మోపడం పద్ధతి కాదన్నారు. అమ్మఒడి రూ.15వేలు ఇస్తానని 2వేల కోత విధించారన్నారు. ప్రధానమంత్రి భీమవరం వస్తుంటే స్థానిక ఎంపి రఘురామకృష్ణరాజుకు విఐపి పాస్ ఇవ్వలేదంటే రాష్ట్రంలో ఎంత దౌర్జన్యం జరుగుతుందో దీన్నిబట్టి తెలుస్తుందన్నారు. సీఎం జగన్ నిర్ణయాలు తుగ్లక్‌ను తలపిస్తున్నాయనీ, 3, 4, 5 తరగతులను విలీనం చేస్తామని తీసుకున్న నిర్ణయంతో ఆయా తరగతుల పిల్లలు ఏ స్కూల్‌కు వెళ్లాలో తెలియని పరిస్థితి ఉందన్నారు.

కేంద్రం కుట్రల్ని తిప్పికొడదాం

509వ రోజుకు చేరిన ఉక్కుదీక్షలు

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణకు కేంద్రం పన్నుతున్న కుట్రలను తిప్పికొట్టాల్సిన అవసరముందని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ సభ్యులు జి బోసు బాబు అన్నారు. స్టీల్ ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే దీక్షలు మంగళవారం నాటికి 509 వ రోజుకు చేరుకున్నాయి. విశాఖ ఉక్కు కర్మాగారం నుంచి సీఓ అండ్ సీపీపీ ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొ న్న ఈ శిబిరంలో పోరాట కమిటీ ప్రతినిధులు బోసుబాబు, ఆనంద్ మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారంలో కోకో ఓవెన్ ఉత్పత్తిలో ప్రధాన భూమిక పోషిస్తుందన్నారు. అయితే ఆ ఉత్పత్తి తగ్గించడం వెనక కూడా కుట్ర ఉందని పేర్కొన్నారు. గతంలో 450 పుషింగ్‌లు జరిగేవని నేడు 250 వరకు తగ్గించారని తెలిపారు. దీని వెనుక యాజమాన్యం హస్తం ఉందని ఆరోపిం చారు. తక్షణమే పూర్తిస్థాయి ఉత్పత్తిని చేపట్టాలని డిమాండు చేశారు. ఈ శిబిరంలో ప్రతినిధులు కామేశ్వరరావు, ఎం.శ్రీనివాసరావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీ కేసును కొట్టేయండి

హైకోర్టును ఆశ్రయించిన ఏబీ వెంకటేశ్వరరావు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: తనపై ఏసీబీ నమోదు చేసిన కేసును కొట్టివేయాలని సీనియర్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు వేసిన పిటీషన్‌ను హైకోర్టు మంగళవారం విచారణకు స్వీకరించింది. గత ప్రభుత్వ హయాంలో నిఘా విభాగాధిపతిగా విధులు నిర్వహిస్తున్న సమయంలో భద్రత పరికరాల కొనుగోలు వ్యవహారంలో 2021 మార్చిలో ఏసీబీ తనపై నమోదు చేసిన కేసును రద్దు చేయాలని ఏబీవీ హైకోర్టులో వ్యాజ్యం వేశారు. పరికరాల కొనుగోలు కోసం ఒక్క రూపాయి కూడా ఖర్చుచేయలేదని, ఒక్క పైసా కూడా ఎవరికి చెల్లించలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఏపీ విజిలెన్స్ కమిషన్ ఆమోదం పొందకుండానే సాధారణ విచారణ జరిపి తనపై కేసు పెట్టారని, తప్పుడు ఆరోపణలతో నమోదు చేసిన ఈ కేసును రద్దు చేయాలని ఏబీ పిటిషన్లో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి 15 నెలలు అవుతుందని వెంకటేశ్వరరావు తరపు న్యాయవాది ఆదినారాయణ రావు కోర్టుకు తెలిపారు. కనీసం చార్జ్‌షీటు కూడా దాఖలు చేయలేదని చెప్పారు. దీంతో కేసు దర్యాప్తు వివరాలు తెలపాలని హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. కౌంటర్ వేసేందుకు నాలుగు వారాలు సమయం కావాలని ప్రభుత్వ న్యాయవాది కోరగా.. జడ్జి రెండు వారాల సమయం మాత్రమే ఇస్తూ.. జూలై 19వ తేదీకి కేసు విచారణ వాయిదా వేశారు.

టీఆర్ఎస్ కార్యకర్తలను అరెస్టు చేయాల్సిందే

జోరువానలో షర్మిల దీక్ష

హుజూర్‌నగర్: టీఆర్ఎస్ వైఖరికి వ్యతిరేకంగా సూర్యాపేట జిల్లాలోని హుజూర్‌నగర్ మండలం లక్కవరంలో వైటీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల నిరసన దీక్షకు దిగారు. ప్రజాప్రస్థానం పాదయాత్రలో భాగంగా 31వ వారం లక్కవరంలో షర్మిల నిరుద్యోగ నిరాహార దీక్ష చేపట్టారు. అందుకు పోటీగా టీఆర్ఎస్ శ్రేణులు నిరసనకు దిగాయి. ఈక్రమంలో ఉభయ పార్టీల కార్యకర్తల మధ్య తోపులాట జరిగింది. తమ పార్టీ నాయకుడు ఏపూరి సోమన్నపై దాడి చేసిన టీఆర్ఎస్ కార్యకర్తలను అరెస్టు చేయాలని షర్మిల డిమాండ్ చేశారు. వారిని అరెస్టు చేసే వరకు దీక్ష విరమించేది లేదని స్పష్టం చేస్తూ వైఎస్సార్ విగ్రహం వద్ద జోరువానలో దీక్ష కొనసాగిస్తున్నారు. దీక్ష విరమించాలని పోలీసులు నచ్చజెప్పేందుకు ప్రయత్నించినా ఆమె పట్టించుకోకుండా దీక్ష కొనసాగించారు.

శ్మశానవాటికలో శిశువు

విశాలాంధ్ర-మల్కాపురం: విశాఖ పారిశ్రామిక వాడ శ్రీహరిపురం, కోరమండల్ గేటు సమీపంలో గల శ్మశాన వాటికలో పుట్టిన పసి కందును మంగళవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు వదిలి వెళ్లిపోయారు. ఈ సంఘటన స్థానిక ప్రజలను తీవ్రంగా కలచివేసింది. జీవీఎంసీ శానిటరీ సిబ్బంది స్మశాన వాటిక పక్కనే ఉన్న శానిటరీ వాహనాన్ని తీసుకువెళ్లడానికి రావడంతో పసికందును గమ నించి, బయటికి తీసుకురాగా అప్పటికే పసికందును చీమలు, పురుగులు తీవ్రంగా కుట్టేవేశాయి. స్థానికుల సహాయంతో మల్కాపురం పోలీసులు స్థానిక ఆసుపత్రిలో చేర్చారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ శిశువు మృతి చెందినట్లు పోలీసులు వెల్లడించారు. స్మశాన వాటికలో పుట్టిన పసికందును ఎవరు వదిలి వెళ్లారన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సంపాదకీయం

లక్ష్మణ రేఖ బేఖాతరు

న్యాయమూర్తులు, ముఖ్యంగా సుప్రీంకోర్టు న్యాయమూర్తులు చెప్పే తీర్పులకన్నా విచారణా క్రమంలో చేసే వ్యాఖ్యలు వాడిగా ఉంటున్నాయి. సహజంగానే వాటికున్న ప్రచార సౌలభ్యంవల్ల మీడియా వాటికి అధిక ప్రాధాన్యం ఇస్తూ ఉంటుంది. న్యాయమూర్తులు చేసే ఇలాంటి వ్యాఖ్యలతో ఓ సమస్య ఉంది. ఈ వ్యాఖ్యలేవీ తీర్పుల్లో భాగం కాదు. తీర్పుల దగ్గరకు వచ్చేసరికి అవి అనేక సందర్భాలలో నిరాశాజనకంగానే ఉంటున్నాయి. న్యాయ మూర్తులు విచారించవలసింది, తీర్పులు చెప్పవలసింది తమ పరిశీలనకు వచ్చిన అంశాల మీదే. ఇతరేతర అంశాల గురించి వ్యాఖ్యానిస్తే వినసొంపుగానే ఉంటాయి. కాని ధర్మ నిర్ణయానికి ఉపకరించేవి కావు. బీజేపీ అధికార ప్రతినిధిగా ఉన్నప్పుడు నూపుర్ శర్మ మహమ్మద్ ప్రవక్త మీద చేసిన విమర్శలు వివాదాస్పదమైనాయి. గల్ఫ్ దేశాలలో నూపుర్ శర్మ వ్యాఖ్యలపై దుమారం చెలరేగింది. మూడు దేశాలైతే అక్కడి భారత రాయబారులను పిలిపించి నిరసన వ్యక్తం చేశాయి. ఆ వ్యాఖ్యలను ఆమె ఉపసంహరించుకున్నారు కూడా. బీజేపీ ఆమెను అధికార ప్రతినిధి బాధ్యతల నుంచి తప్పించింది. ఆమెను పార్టీ నుంచి సస్పెండ్ కూడా చేసింది. నూపుర్ శర్మ వ్యాఖ్యల పర్యవసానంగా ఆమె మీద దేశంలోని అనేక హైకోర్టుల్లో పిటిషన్లు దాఖలైనాయి. ఆరోపణ ఒకటే అయినప్పుడు వేర్వేరు హైకోర్టులు విచారించినందువల్ల కలిగే అదనపు ప్రయోజనం ఏమీ ఉండదు. ఒక వేళ ఆమె మీద ఆరోపణలు రుజువైనా ఒకే సారి శిక్ష పడ్తుంది. ఆమెను హత్య చేస్తామన్న బెదిరింపులు కూడా వచ్చాయి. అందుకని ఆమె సుప్రీంకోర్టు మెట్లెక్కి ఈ కేసులన్నింటినీ దిల్లీ కోర్టుకు బదలాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు సూర్య కాంత్, పార్దీవాలా ఆమె అర్జీని తిరస్కరించడమే కాకుండా జులై ఒకటవ తేదీన ఆమె "నోటికి హద్దు లేదు" అని, ఆమె వ్యాఖ్యలవల్ల దేశమంతా అగ్గి అంటుకుంది" అని వ్యాఖ్యానించారు. "ఆమె ప్రచారంలో ఉండడానికి లేదా రాజకీయ ఎజెండాలో భాగంగా, లేదా దుర్మార్గమైన కార్యకలాపాలను సమర్థించుకోవడానికి ఇలా మాట్లాడారు" అని ఇద్దరు న్యాయ మూర్తులు విరుచుకు పడ్డారు. ఈ మాటల్లో నిజానిజాల మాట ఎలా ఉన్నా వ్యాఖ్యానించింది న్యాయమూర్తులు కనక వీటికి ప్రచారార్హత ఉంటుంది. కానీ ఈ వ్యాఖ్యలకు సందర్భ శుద్ధి ఉందా అని ఆలోచిస్తే లేదనే సమాధానం వస్తుంది. కోర్టుకు వెలుపల జరుగుతున్న పరిణామాలతో ప్రభావితం అయి న్యాయమూర్తులు మాట్లాడడం లేదా తీర్పులు చెప్పడం భావ్యం కాదు. ఈ వ్యాఖ్యలేవీ సుప్రీంకోర్టు జారీ చేసిన ఉత్తర్వులో భాగం కాదు. నూపుర్ శర్మ మీద మాత్రమే విరుచుకు పడడం ద్వారా దేశంలో కొనసాగుతున్న విద్వేష ప్రచారాన్ని సుప్రీంకోర్టు పట్టించుకోకుండా వదిలేస్తోందనిపిస్తోంది. ఈ ఇద్దరు న్యాయమూర్తుల మీద ఆ తరవాత సామాజిక మాధ్యమాలలో పెద్ద దుమారమే చెలరేగింది. మరో సమావేశంలో మాట్లాడుతూ న్యాయమూర్తి పార్దీవాలా న్యాయమూర్తుల మీద వ్యక్తిగత దాడి చేయడాన్ని తప్పుబట్టారు. సామాజిక మాధ్యమాలలో ఇలా దాడి చేయడం పరిపాటి అయి పోయింది. దీన్ని కట్టడి చేసే అవకాశమే లేదు. విచారణ సందర్భంగా న్యాయమూర్తుల ప్రాస్తావిత అంశాలు (ఆబిటర్ డిక్టా) న్యాయ ప్రక్రియలో భాగమే. కానీ ఆ వ్యాఖ్యలకు సమయం సందర్భం, ఔచిత్యం ఉండాలి.

సుప్రీంకోర్టు న్యాయమూర్తుల వ్యాఖ్యలకు చాలా విలువ ఉంటుంది. వాటిలో ఉచితానుచితాలు బేరీజు వేయడానికి న్యాయ కోవిదులు కూడా జడుస్తారు. అసలు కోర్టు ముందున్న వివాదానికి అతీతంగా తీర్పు చెప్పిన ఉదంతాలు లెక్కలేనన్ని ఉన్నాయి. అయోధ్య వివాదంలో వెలువడిన అంతిమ తీర్పే దీనికి నిదర్శనం. కానీ 15 మంది మాజీ న్యాయమూర్తులు, 77 మంది మాజీ ప్రభుత్వ ఉన్నతా ధికారులు, 25 మంది మాజీ సైనికాధికారులు న్యాయమూర్తులు సూర్య కాంత్, పార్దీవాలా కలిసి నూపుర్ శర్మపై చేసిన వ్యాఖ్యలలో అనౌచిత్యాన్ని ఎత్తి చూపారు. "దేశంలో జరుగుతున్న అల్లకల్లోలానికి నూపుర్ శర్మ వ్యాఖ్యలే ఏకైక కారణం అని ఇద్దరు న్యాయమూర్తులు అనడం ఉదయ్‌పూర్‌లో కన్హయ లాల్‌ను నరికి చంపడాన్ని గాలికి వదిలేసినట్టే" అని ఈ మాజీలు రాసిన బహిరంగ లేఖలో తూర్పారబట్టారు. కన్హయా లాల్ సామాజిక మాధ్యమాలలో నూపుర్ శర్మను సమర్థించినందుకు ఆయనను హతమార్చారు. నూపుర్ శర్మ మీద ఇద్దరు న్యాయమూర్తులు చేసిన వ్యాఖ్యలు దేశ న్యాయవ్యవస్థ చరిత్రలోనే ఎక్కడా లేవని ఈ లేఖలో పేర్కొన్నారు. నూపుర్ కేసును ఈ ఇద్దరు న్యాయమూర్తులు భిన్నంగా ఎందుకు పరిగణించారో అర్థం కావడం లేదన్నారు. ఇలాంటి మాటలవల్ల సుప్రీంకోర్టుకు ఉన్న గౌరవ మర్యాదలు, పవిత్రత దెబ్బ తింటాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ లేఖ మీద సంతకాలు చేసిన 117 మందిలో బొంబాయి హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి క్షితిజ్ వ్యాస్, గుజరాత్ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎస్.ఎం.సోని, రాజస్థాన్ హైకోర్టు మాజీ న్యాయమూర్తులు ఆర్.ఎస్. రాథోడ్, ప్రశాంత్ అగర్వాల్, దిల్లీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి ఎస్.ఎన్. దింగ్రా లాంటి ఉద్దండులున్నారు. మాజీ ఐ.ఎ.ఎస్. అధికారులు ఆర్.ఎస్. గోపాలన్, ఎస్. కృష్ణ కుమార్, మాజీ పోలీసు ఉన్నతాధికారులు ఎస్.పి. వైద్, పి.సి. డోగ్రా, మాజీ సైనికాధికారులు లెఫ్టినెంట్ జనరల్ వి.కె. చతుర్వేది, ఉద్యోగ విరమణ చేసిన ఏర్ మార్షల్ ఎస్.పి.సింగ్ వంటి వారు కూడా ఈ లేఖ మీద సంతకాలు చేశారు. న్యాయ మూర్తులు ఇలా వ్యాఖ్యానించడం దురదృష్టకరమే కాక న్యాయవ్యవస్థకు చెరగని ముద్ర అని కూడా వీరు ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి వ్యాఖ్యలవల్ల ప్రజాస్వామ్యానికి, దేశ భద్రతకు ముప్పు కలుగుతుందని అన్నారు. ఇద్దరు న్యాయమూర్తులు ఈ వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలని కూడా విజ్ఞప్తి చేశారు. ప్రజాస్వామ్యానికి మూల కందమైన విభిన్న వ్యవస్థలు దేనికదే తమ విధి సక్రమంగా నిర్వర్తించినప్పుడే వ్యవస్థ పదిలంగా ఉంటుందని పేర్కొన్నారు. ఇలాంటి వ్యాఖ్యలు చేయడం లక్ష్మణ రేఖ దాటడమే అన్నారు. ఇద్దరు న్యాయమూర్తుల వ్యాఖ్యలు న్యాయవ్యవస్థ మౌలిక లక్షణాలకు, నిష్పక్షపాత వైఖరికి విఘాతం కలిగిస్తాయని హెచ్చరించారు. అర్జీ పెట్టుకున్న వారి మీద ఎలాంటి విచారణ లేకుండా దారుణమైన వ్యాఖ్యలు చేయడం హద్దు దాటడమే. న్యాయం కోరుతూ కోర్టు మెట్లెక్కిన వారి మీద విరుచుకుపడడం ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రమాద హెచ్చరికే అవుతుంది. రిపబ్లిక్ టీవీ అధినేత, ప్రసిద్ధ పత్రికా రచయిత అర్నాబ్ గోస్వామికి సుప్రీంకోర్టు ఆఘమేఘాల మీద బెయిలు మంజూరు చేసినప్పుడు నూపుర్ శర్మ విషయంలో భిన్న ప్రమాణాలు అనుసరించడం విడ్డూరంగా ఉందని ఈ లేఖ రాసిన వారు ఎత్తిపొడిచారు. నిజానికి నూపుర్ శర్మ తన మీద దాఖలైన కేసులన్నింటినీ ఒకే కోర్టుకు బదిలీ చేయాలని అభ్యర్థించడం ఏ రకంగానూ అన్యాయమూ కాదు. అక్రమమూ కాదు.

మన్రో సేవలు మరువలేనివి

డా ముచ్చుకోట సురేష్‌బాబు

దేశాన్ని దోచుకుతిన్న పాలకుల్లో మనదేశ రైతులు, ఇతర అణగారిన ప్రజలకు ఎంతగానో సేవలందించినవాడు సర్ థామస్ మన్రో. ప్రధానంగా తెలుగు ప్రజలు మరువరాని తెల్లవాళ్లలో అగ్రగణ్యుడు సర్ థామస్ మన్రో. రాయలసీమ వాసులకు ఆపద్బాంధవుడు ఆయన. "ప్రజల పట్ల నిజాయితీతో కూడిన సానుభూతి గల సుని శిత మేధావి" అని కార్ల్ మార్క్స్ ప్రశంస లందుకున్న పరిపాలకుడు సర్ థామస్ మన్రో.

సర్ థామస్ మన్రో 1761 మే 27న జన్మించారు. 1827 జులై 6న మరణించారు. స్కాట్లాండుకు చెందిన యోధుడు, అధికారి. ఈయన తండ్రి అలెగ్జాండర్ మన్రో గ్లాస్గో నగరంలో పేరుపొందిన వ్యాపారి. తల్లి మార్గరెట్ స్కార్క్. థామస్ గ్లాస్గో విశ్వవిద్యాలయంలో చదువుకున్నాడు. 1789 సంవత్సరంలో మద్రాసు పదాతి దళంలో కాడెట్‌గా చేరాడు. హైదర్ ఆలీతోను (1780–1783) తరవాత టిప్పు సుల్తాన్‌తోను (1790–1792) తలపడ్డాడు. టిప్పు సుల్తాన్ పతనం తరవాత రాయలసీమ ప్రధాన కలక్టర్‌గా నియమితులయ్యారు. మన్రో తన సైన్యంతో 1800–1807 మధ్య కాలంలో తిరుగుబాటు దారులను నిర్దాక్షిణ్యంగా అణచివేశాడు. థామస్ మన్రో రైతుల పట్ల ఎంతో ఉదారంగా వ్యవహరించాడు. రైత్వారీ విధానం ప్రవేశపెట్టి తరతరాల నుండి పాలెగాండ్ర దోపిడీకి గురై అనేక ఇబ్బందుల పాలైన రైతులను ఆదుకున్నాడు. 1804లో కడప జిల్లాకు వరదలు వచ్చినప్పుడు చెరువులను, కాలువలను సకాలంలో మరమ్మత్తు చేయించి పుష్కలంగా పంటలు పండే ఏర్పాటు చేశాడు. 1807లో మన్రో తన పదవికి రాజీనామా చేసి స్వదేశానికి తిరిగి వెళ్ళాడు. మన్రో 1820 జూన్ 8వ తేదీన మద్రాసు గవర్నరుగా తిరిగి వచ్చాడు. అతడు పాలించిన ఏడు సంవత్సరాలు రాష్ట్రంలో విద్యాభివృద్ధికి కృషి చేశాడు. కర్నూలు జిల్లాలో పర్యటిస్తూ కలరా వ్యాధి సోకి 1827, జులై 6వ తేదీన మరణించాడు. బ్రిటిష్ పాలనలో చిత్తూరు కలెక్టర్‌గా పనిచేసిన సర్ థామస్ మన్రో పెద్ద వెండి గంగాళాన్ని తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వారికి కానుకగా ఇచ్చాడు. దీనినే మన్రో గంగాళం అంటారు. నేటికీ స్వామివారికి దీనిలోనే నైవేద్యం పెడతారు. రాయదుర్గంలోని ప్రసన్న వేంకటేశ్వరస్వామిని దర్శించాడు. ఆలయానికి మాన్యాలిచ్చాడు. రాయలసీమ అభివృద్ధికి తోడ్పాటిచ్చాడు. రాయలసీమ తరతరా లుగా అనావృష్టికి గురైన ప్రాంతం. ప్రకృతి వైపరీత్యానికి తోడుగా, పిండారీల దోపిడీలు, పాలెగాండ్ర దురాగతాలు సీమ ప్రజలను నానా యాతనలకు గురి చేసేవి. అశాంతితో పరితపిస్తున్న ప్రజానీకాన్ని ఆదుకొని, సీమలో శాంతి భద్రతలను నెలకొల్పిన మహనీయుడు. 1792లో జరిగిన శ్రీరంగపట్నం సంధి ప్రకారం కడప, అనంతపురం, కర్నూలు, బళ్ళారి నిజాం పాలనలోకి వచ్చాయి. నిజాం పాలనలో అరాచకం మరింత పెరిగింది. పాలెగాళ్ళ అక్రమాలకు అంతులేకపోయింది. కడప జిల్లాలోని వేముల పాలెగాడు తనను తాను రాజుగా ప్రకటించుకొన్నాడు. కొరవలు, యానాదులు, బేదర్లు, ఎరుకలు గ్రామాలపైపడి దోచుకోసాగారు. ఆ పరిస్థితులలో 12-10-1800న దత్త మండలాల ప్రధాన కలెక్టరుగా మన్రో వచ్చారు. అతని కింద నలుగురు సబ్ కలెక్టర్లు వుండేవారు. ఆదవాని, హల్పనహళ్ళి, కడప, కంబంలలో వీరి కార్యాలయాలు వుండేవి. మన్రోకు సహాయంగా మేజర్ జనరల్ దుగాల్డ్ క్యాంబెల్ నాయకత్వంలో ప్రధాన కేంద్రాలలో సైనిక దళా లుండేవి. అనంతపురం డివిజన్ మాత్రం మన్రో అధీనంలో వుండేది. సిద్ధవటంలో వున్న కడప జిల్లా కార్యాలయం 1812లో కడపకు మారింది. 1828లో కంభం, దూపాడు, కోయిల కుంట్ల ప్రాంతాలను కడప జిల్లా నుండి విడదీసి కర్నూలు జిల్లాగా ఏర్పాటు చేశారు. 1911లో మదనపల్లె, వాయిల్పాడు ప్రాంతాలను కడప జిల్లా నుండి విడదీసి చిత్తూరు జిల్లాగా ఏర్పాటు చేశారు.

రైతు బాంధవుడు మన్రో నిజాయితీపరుడు. ప్రజల నుండి, రైతుల నుండి ఎట్టి కానుకలు స్వీకరించేవాడు కాదు. మన్రోకు స్వాగతమివ్వటానికి ఒక గ్రామాధికారి తన గ్రామంలో పెద్ద పందిరి వేయించాడు. అందుకు కూలీలకు పైసా ఇవ్వలేదని తెలుసుకున్న మన్రో పందిరి వద్దకైనా వెళ్ళక చెట్టునీడన చిన్న డేరాలో మకాం చేశాడు. రైతుల నుండి పాలు, పళ్ళు కూడా ఉచితంగా తీసుకొనేవాడు కాదు. తన క్రింది అధికారులను కూడా అలాగే వుండనిచ్చేవాడు. రైతుల నుండి ఎక్కువ శిస్తులు వసూలు చేయటం న్యాయం కాదన్నాడు. భూ సంబంధమైన చట్టాల ముందు, బీదలు, ధనికులు అన్న తేడా వుండరాదన్నాడు. ఎవరైనా సరే తనకున్న భూమినంతటినీ తనకున్న వనరులతో సాగు చేసుకోవచ్చునన్నాడు. అంతవరకు గ్రామ ప్రాంతాలలో భూముల మీద వున్న అగ్రవర్ణాల వారి పెత్తనంపై చావు దెబ్బతీశాడు. భూమి ప్రభుత్వ ఆస్తి, నిర్ణీత శిస్తుపై రైతులకు కౌలుకు యివ్వాలని ఆదేశించాడు. రాయలసీమ ప్రాంతంలో తానున్న ఏడేళ్ళ కాలంలో మన్రో 2,06,819 పట్టాలను రైతులకు అందజేశాడు. రైతులకు భూమిపై సర్వహక్కులు వుంటాయని ప్రకటించాడు. ఇందువల్ల భూమిసాగు గణనీయంగా పెరిగింది. ప్రభుత్వాదాయం పెరిగింది. భూస్వాములు రైతులకు అన్యాయం చేస్తున్నట్లు వార్త వచ్చిన వెంటనే వారి వద్దకు వెళ్ళి వారి కష్టసుఖాలను విచారించేవాడు. మైళ్ళ తరబడి కాలినడకన గ్రామాల్లో పర్యటించేవాడు. పూడిపోయిన చెరువులు కనబడిన వెంటనే పూడిక తీయించే ఏర్పాటు చేసేవారు. ఉదారమైన భూమిశిస్తును ప్రకటించడం మన్రో గొప్పదనానికి నిదర్శనం.

నేడు మన్రో 195వ వర్ధంతి
వ్యాస రచయిత గౌతమ్ బుద్ధ అభివృద్ధి సమాఖ్య అధ్యక్షులు

ఫిరాయింపులతో ప్రజాస్వామ్య పతనం

సంగిరెడ్డి హనుమంతరెడ్డి

కృష్ణుడే పాంచాలికి ఆరవ పతిని చేస్తానన్నా కర్ణుడు పక్షం మారలేదు. ఇది కర్ణుల కరువు కాలం. విభీషణ భాత్రు వంచనాసూత్ర రాజ్యం. మహారాష్ట్రలో 30 నెలల్లో 3 సార్లు ప్రజాస్వామ్యం భ్రష్టు పట్టింది. బీజేపీయేతర రాష్ట్రాల్లో ప్రజాస్వామ్య పతన యజ్ఞమిది. పాలక స్పీకర్ల, సంఘ్ గవర్నర్ల, రబ్బరు స్టాంపు రాష్ట్రపతుల ఈ యోగయాగం సాగుతూనే ఉంటుంది.

ప్రతిపక్షాలను, ప్రజాస్వామ్యాన్ని ఫిరాయింపు యాగంలో కాల్చేస్తోంది బీజేపీ. దానికి అంతటా తానే ఉండాలన్న దురాశ." ఒక పార్టీకి ఇబ్బంది కలిగిందని మరో ఫిరాయింపు చట్టం తేవాలా?" కేంద్రమంత్రిగా వెంకయ్య ప్రశ్న. ఇబ్బంది పార్టీలకు కాదు, దేశానికి. ఉపాధ్యక్షునిగా ఫిరాయింపులపై చాలా నీతి సూత్రాలు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక తరగతి హోదాలో మాట తప్పినట్లు నీతి తప్పి టీడీపీ రాజ్యసభ సభ్యులకు చట్ట వ్యతిరేకంగా కాషాయ కండువా కప్పారు. గతంలో కాంగ్రెస్ వారు పదవులతోపాటు పార్టీలు మారారు. తెలంగాణలో టీడీపీ సభ్యుల టి.ఆర్.ఎస్. ప్రవేశాన్ని విమర్శించిన చంద్రబాబు ఎపిలో పాత పార్టీ సభ్యత్వం వదలని ఫిరాయింపుదార్లను మంత్రులను చేశారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని, బీజేపీకి చెడ్డ పేరు రాకూడదని (నాడు టీడీపీ బీజేపీ మిత్రపక్షం) ఈ అంశాన్ని మీ దృష్టికి తెస్తున్నానని బీజేపీ మహిళా మోర్చా జాతీయ అధ్యక్షురాలు, కేంద్ర పూర్వ (కాంగ్రెస్) మంత్రి పురంధేశ్వరి మోదీ, షాలకు లేఖ రాశారు. ఇది చంద్రన్నపై కోపమే కాని ప్రజాస్వామ్య నిబద్ధత కాదు. రాష్ట్ర విభజనలో నోరెత్తకుండా, విభజన విధానం నచ్చలేదని, జాతీయ, అంతర్జాతీయ ఖ్యాతినందించిన కాంగ్రెస్‌ను వదిలి అసలు విభజనకర్త బీజేపీలో చేరిన నైతికత ఈమెది. ఫిరాయింపులను బీజేపీ ప్రోత్సహించినా ఈ ప్రజాస్వామ్యవాది నోరెత్తలేదు. ఉత్తరాఖండ్, అరుణాచల్‌లలో బీజేపీ రాజ్యాంగ విరుద్ధ చర్యలను సుప్రీంకోర్టు తిప్పికొట్టింది. మణిపూర్ ముఖ్యమంత్రితో సహా నాయకులంతా అధికారం కోసం బీజేపీకి మారినవారే. త్రిపుర, బెంగాల్‌లో కుర్చీ కోసం సిద్ధాంతాలను వదిలి కాంగ్రెస్, తృణమూల్, వామపక్ష సభ్యులను చేర్చుకున్న ఘనత బీజేపీదే. నేడు తెలంగాణ కాంగ్రెస్ టి.ఆర్.ఎస్.లో కలిసింది. ఫిరాయింపులలో ప్రజాస్వామ్య విలువలున్నదెవరికి?

ప్రజాస్వామ్య పునాదుల పెకలింపునకు ఒక పార్టీ నుంచి మరో పార్టీకి గెంతితే చాలని మాజీ కేంద్ర మంత్రి, లోక్ సభ స్పీకర్, సామ్యవాద నాయకుడు, గాంధేయ వాది కీ.శే. రబీ రే అన్నారు. పార్టీ ఫిరాయింపు వికృతమై ప్రజాస్వామ్యానికే చీడగా మారుతుందని రాజ్యాంగ నిర్మాతలు ఊహించలేదు. రాజ్యాంగం అమలైన 35 ఏళ్ళకు 'ఫిరాయింపు వ్యతిరేక చట్టం' చేయాల్సి వచ్చింది. ఈ చట్టం రాజ్యాంగ 10వ షెడ్యూల్, రాజ్యాంగ (52వ సవరణ) చట్టం, 1985 ద్వారా ప్రవేశపెట్టి రాజ్యాంగ (91వ సవరణ) చట్టం, 2003 ద్వారా సవరించారు. క్లుప్తంగా 10వ షెడ్యూల్ నిబంధనలు : 1. చట్టసభలకు ఒక పార్టీ నుండి ఎన్నికైన/నియమితుడైన సభ్యుడు ఆ పార్టీ సభ్యత్వాన్ని ఐచ్ఛికంగా వదులుకున్నా, సభలో ఆ పార్టీ ఆదేశాలకు వ్యతిరేకంగా ఓటేసినా, ఓటింగ్ నుండి తప్పుకున్నా సభా సభ్యత్వానికి అనర్హుడవుతాడు 2. స్వతంత్ర సభ్యుడు రాజకీయ పార్టీలో చేరితే అనర్హుడవుతాడు 3. ఏ పార్టీకీ చెందని నియామక సభ్యుడు 6 నెల్ల తర్వాత రాజకీయ పార్టీలో చేరితే అనర్హుడవుతాడు 4. మూడింట రెండొంతుల సభ్యుల ఆమోదంతో ఒక పార్టీ ఇంకో పార్టీలో విలీనమైతే అనర్హత కాదు 5. దిగువ సభల సభాధిపతులు, ఉప సభాధిపతులు, ఎగువ సభల అధ్యక్ష ఉపాధ్యక్షులు తమ పార్టీతో సంబంధం తెంచుకోవటం అనర్హత కాదు 6. అనర్హతను సభాధ్యక్షుడు నిర్ణయిస్తారు. సభాధ్యక్షుని అనర్హత నిర్ణయించవలసి వస్తే సభ ఎన్నుకున్న మరొక సభ్యుడు ఆ పని చేస్తారు 7. 10వ షెడ్యూల్ అమలుకు నియమాలు చేసే అధికారం సభాధ్యక్షునిదే. ఐతే వాటిని సభ ముందుంచాలి. సభ వాటిని సవరించవచ్చు. తిరస్కరించవచ్చు. 8. పార్లమెంటుకు, సభ్యులకు ప్రత్యేక అధికారాలు, హక్కులు, మినహాయింపులనిచ్చే రాజ్యాంగ నిబంధనలు 105, 194లతో నిమిత్తం లేకుండా 10వ షెడ్యూల్ నియమాల తిరస్కరణ సభాహక్కుల ఉల్లంఘనగా పరిగణిస్తారు.

1985 డిసెంబర్‌లో లోక్‌సభ స్పీకర్ ప్రతిపాదించిన 10వ షెడ్యూల్ 8వ పేరా నియమాలు 18.03.1986 నుండి అమల్లోకి వచ్చాయి. సభ్యత్వ అనర్హత నిర్ణయాధికారం స్పీకర్లదే. స్పీకర్లు పాలక పార్టీకి రాజీనామా చేయరు. దానితో సంబంధాలు కొనసాగిస్తారు. (ఇది 10వ షెడ్యూల్ 5వ నిబంధన ఉల్లంఘన) తమ నాయకునికి నమ్మిన బంటులా ఉంటారు. ఆయన అభీష్టాన్ని నెరవేర్చకుంటే తమ పదవి ఊడుతుందని వారికి తెలుసు. చట్టాన్ని నిష్పక్షపాతంగా అమలు చేయరు. ప్రజాస్వామ్యాన్ని కాపాడవలసిన స్పీకర్లు అధికార పక్షీయులుగా పాలక పార్టీల ప్రయోజనాలు కాపాడుతున్నారు. పార్టీ ఫిరాయించిన వ్యక్తి ఐచ్ఛికంగా పాత పార్టీ సభ్యత్వాన్ని వదులుకున్నట్లే. 10వ షెడ్యూల్ 1వ నిబంధన ప్రకారం ఆ సభ్యుడు చట్టసభ సభ్యత్వానికి అనర్హుడు. స్పీకర్లు విజ్ఞత, వివక్షతలను పాటించరు. అనర్హతలను ప్రకటించరు. 8వ నిబంధన ప్రకారం ఇది సభా హక్కుల ఉల్లంఘన.

ప్రభుత్వ ఏర్పాటుకు ఆధిక్యత లేకపోతే ప్రతినిధులు ఫిరాయిస్తారు. పార్టీ మారి ప్రభుత్వాలను పడగొట్టిన, నిలబెట్టిన సందర్భాలు ఎన్నో. ఇప్పుడు ఇవేవీ లేకుండానే పార్టీ మారి అధికార పార్టీలో దూరుతున్నారు. గుత్త సంస్థల అధిపతులు రాజకీయులయ్యారు. దొడ్డిదార్లలో వ్యాపారాభివృద్ధి, ఆస్తుల సంపాదన, అక్రమాస్తుల రక్షణ వారి ప్రధాన అవసరాలు. అధికార సుఖాలు మరిగిన వారు కుర్చీ లేకుండా బతకలేరు. అధికార పార్టీకి మారుతారు. అధికార పార్టీతో 'నీకిది నాకది' సూత్రంలో ఆర్థిక, అధికార పంపకాలు, తప్పుల నుండి తప్పించుకోడం, అవినీతి కుంభకోణాలు, ఆస్తుల జప్తులు, న్యాయ విచారణల నుండి రక్షణ, అక్రమ సంపాదన కొనసాగింపు/ ఏర్పాటు ఫిరాయింపుల లక్ష్యం. పాలక పార్టీలు తమ తప్పుడు విధానాలను, నిరంకుశ పాలనను ప్రశ్నించే ప్రతిపక్షాలను బలహీనపరుస్తున్నాయి. బలహీన ప్రతిపక్షం, ప్రతిపక్షరాహిత్యం చట్టసభల స్వభావాన్ని మార్చి, ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తాయి. ఏ పార్టీ దీనికి అతీతం కాదు. తమవారు పార్టీ మారితే విమర్శ. ఇతరులు తమ పార్టీలోకొస్తే ప్రోత్సాహం. సంబంధంలేని సందర్భాలలో నిశ్శబ్దం. ఒక పార్టీ సిద్ధాంతాలపై, ప్రణాళికపై ఐదేళ్ళకు ఎన్నుకున్న ప్రతినిధులు పార్టీ మారితే పాత పార్టీ సిద్ధాంతాలు, ప్రణాళికలపై తమను ఎన్నుకున్న ప్రజలను మోసగించడమే. పాత పార్టీ నుండి పొందిన ప్రాతినిధ్యాన్ని, పదవులను, హోదాలను వదిలేయాలి.

స్పీకర్ పార్టీరహితంగా, తటస్థంగా ఉండాలని రాజ్యాంగ లక్ష్యం. స్పీకర్ పదవులను ఏ పార్టీకీ చెందని రాజ్యాంగ నిపుణులకు ఇవ్వాలి. సభ్యత్వ అనర్హత నిర్ణయాధికారాన్ని ఎన్నికల సంఘానికో, న్యాయవ్యవస్థకో అప్పజెప్పాలి. నిర్ణయాన్ని వెంటనే ప్రకటించాలి. అనర్హులు సభ్యులుగా కొనసాగే అవకాశమివ్వరాదు. నేటి ఎన్నికల విధానం పాలకపక్షాలకు అనుకూలం. చట్ట సభల్లో ప్రత్యామ్నాయ పక్షాల ఉనికికి ఎన్నికల సంస్కరణలు అవసరం. దామాషా పద్ధతిలో వ్యక్తిని కాక పార్టీని ఎన్నుకుంటారు. ఫిరాయింపులుండవు. గెలుపోటముల ప్రసక్తి లేనప్పుడు ప్రజలు కమ్యూనిస్టులకు ఓటేస్తారు. చట్టసభల్లో ప్రాతినిధ్యం కోసం వామపక్షాలు ఎన్నికల సంస్కరణలకు ఉద్యమించాలి. బలమైన పౌర సంఘాలను నిర్మించాలి. ఫిరాయింపులను నిరసించేటట్లు ప్రజలను చైతన్య పర్చాలి. ఫిరాయింపుల్లో పదవుల రాజీనామాకు ఒత్తిడి పెంచాలి. మాధ్యమాలు పార్టీల వత్తాసు మాని, ప్రజా శ్రేయస్సుకు పని చేయాలి.

వ్యాస రచయిత ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యదర్శి, 9490204545

మకిలి రాజకీయాలతో చట్టాలు వెలవెల

ఆర్.జగన్నాధన్

భారతదేశంలో రాజకీయం మురికిపట్టి చట్టాలు, శాసన వ్యవస్థలు వెలవెలపోతున్నాయి. అనైతిక పొత్తులు, వ్యక్తిగత వెన్నుపోట్లు రాజకీయాలను మరింతగా మకిలపరుస్తున్నాయి. ఇందుకు తాజా ఉదాహరణ మహారాష్ట్ర. అసెంబ్లీలో మెజారిటీ నిరూపించుకోక ముందే ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలని కోరుకున్నది. మహా వికాస్ అఘాడి (శివసేన కాంగ్రెస్, ఎన్‌సిపి) కోర్కెను సుప్రీంకోర్టు తిరస్కరించి అసెంబ్లీలో విశ్వాస పరీక్షకు అనుమతించింది. డిప్యూటీ స్పీకరు ప్రభుత్వం వైపు, గవర్నరు... షిండే- బీజేపీకి అండగా ఉన్నారన్న విమర్శలు వచ్చాయి. పార్టీ ఫిరాయింపు వ్యతిరేక చట్టం ఉంది. మూడింట రెండు వంతుల మంది ఉంటే దాన్ని చీలికగా భావిస్తారు. ఫిరాయింపులను కప్పదాట్లను ఆపలేకపోయారు. చీలికగా గుర్తించడానికి అవసరమైనంత మంది ఎమ్మెల్యేలున్నప్పటికీ అలా ప్రకటించలేదు. ఎందుకంటే బాధిత పార్టీ మరో చర్య తీసుకోవచ్చునని షిండే గ్రూపు, బీజేపీ భావించాయి. ప్రభుత్వం ఏర్పాటుకు కొద్దిమంది మంత్రి పదవిని డిమాండ్ చేయగా ప్రభుత్వ ఏర్పాటుకు తగినంత సంఖ్య లేకపోయినా బీజేపీ తిరస్కరించింది. దీంతో సూత్రబద్ధత లేని కాంగ్రెస్, ఎన్‌సిపి, శివసేన పార్టీలు కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. ఇది బీజేపీకి గిట్టలేదు. సమయం కోసం ఎదురు చూసిన బీజేపీ ఇప్పుడు తన నాటకానికి తెరతీసి విజయవంతమైంది. ఇలాంటి ఘటనలు మహారాష్ట్రకే పరిమితం కాలేదు. రాజకీయ వర్గం చట్టాలను నిర్వీర్యం చేయాలని మాయోపాయాలు పన్నినప్పుడు ఏ చట్టం పని చేయదు. బీజేపీ లాంటి పెద్ద పార్టీలు తమ అవసరం మేరకు చిన్న పార్టీలతో పొత్తు పెట్టుకుని పని జరుపుకుంటాయి. ఆ తర్వాత వాటిని నాశనం చేయడానికి పెద్ద పార్టీలు వెనుకాడవు. ఒకవేళ శివసేనతో తిరిగి సఖ్యతగా ఉండాలని భావిస్తే బీజేపీ ఉదారంగా వ్యవహరించవలసి ఉంటుంది. జాతీయంగా కూడా ఇది వర్తిస్తుంది. బీజేపీ తన అజెండాను అమలు చేస్తూ ప్రతిపక్షాలతో నిమిత్తం లేదని భావిస్తోంది. ఈ తరుణంలో ప్రభుత్వ విధానాలను చట్టసభల్లో ఓడించాలనుకున్నప్పుడు అవి వీధుల్లోకి వస్తాయి. సంస్కరణ చట్టాలు, పౌరసత్వ సవరణ

తగ్గితే ఇతర పార్టీ నుంచి ఫిరాయించ దలచిన ఎమ్మెల్యేలు రాజీనామా చేసి, తిరిగి పోటీలో నిలిచి గెలిచాక పాలక పార్టీలో చేరాలి. కర్నా టకలో ఇలా జరిగింది. స్పీకర్లు, (డిప్యూటి స్పీకర్లు) గవర్నర్లు తట స్థంగా ఉండకుండా రాజకీయ నాటకం వెనుక ఉండి కీలక పాత్ర పోషిస్తున్నారు. ఫలితంగా న్యాయం కోసం కోర్టులను ఆశ్రయిస్తున్నారు. దీనివల్ల ముఖ్యమైన రాజ్యాంగ బద్ధ గవర్నరు, స్పీకరు పదవులను దిగజారుస్తున్నారు. రాజకీయ నాటకం, వ్యక్తిగత ప్రతీకారాలు పరిస్థితు లను మరింత అధ్వానంగా తయారు చేస్తున్నాయి. మహారాష్ట్రలో ఈ రెండూ జరిగాయి.

2014లో ఎన్‌సిపి ప్రభుత్వం ఏర్పాటుకు ప్రతిపాదించగా బీజేపీ ఉచ్చులో పడింది. దాదాపు 25 ఏళ్లుగా కలిసిమెలిసి ఉన్న శివసేనను బీజేపీ నిర్లక్ష్యం చేసింది. అయినప్పటికీ శివసేన దేవేంద్ర ఫడ్నవీస్ ప్రభుత్వంలో ద్వితీయ శ్రేణిగా ఉండేందుకు అంగీకరించింది. అయితే ఉద్ధవ్ థాకరే సమయం కోసం ఎదురు చూశాడు. 2019లో ముఖ్య (చట్టం) తదితరాలు వీధుల్లోకి వచ్చాయి. అందువల్ల బలం ఉంది కదా అనుకొని ముందుకు వెళ్లాలనుకున్న ప్పుడు కూడా ఏకాభిప్రాయం సాధిం చడం సరైన పద్ధతి. అన్నిటికంటే ఇప్పుడు ప్రభుత్వాలు ఏర్పాటు చేయా లన్నా లేదా పడగొట్టాలన్నా ధన ప్రభావం కీలకంగా నిలిచింది. అయితే దీన్ని కోర్టులో రుజువు చేయ లేరు. సమూలంగా ఎన్నికల సంస్క రణలు అమలు చేయకుండా దొంగ డబ్బు ప్రభావాన్ని నిరోధిం చడం కష్టం. ఎన్నికల బాండ్లు నల్లధనాన్ని పెంచుతాయేగాని తగ్గించలేవు. డబ్బు ప్రభావం ఎన్నికలపై తీవ్రంగా ఉంది. అన్ని పార్టీలతో ఏకాభిప్రాయం సాధించి ఎన్నికల సంస్కరణ లను చేయడం ఒక్క ప్రధానమంత్రి మాత్రమే చేయగలడు. ప్రధాని చొరవ తీసుకుంటే ప్రతిపక్షాలు ముందుకు వస్తాయి. ఇది జరగకపోతే రాజకీయాలు చట్టసభల్లో న్యాయబద్ధంగా ఉండవు, అవి వీధుల్లో న్యాయబద్ధమవుతాయి.

వ్యాసకర్త స్వరాజ్య పత్రిక ఎడిటోరియల్ డైరెక్టరు
(టైమ్స్ ఆఫ్ ఇండియా సౌజన్యం)

లాటిన్ అమెరికాలో విస్తరిస్తున్న వామపక్షం

బి. లలితానంద ప్రసాద్



ఇప్పుడు అందరి కళ్లు బ్రెజిల్‌పై ఉన్నాయి. ఇది లాటిన్ అమెరికాలో అతి పెద్ద దేశం. అక్కడ పూర్వ అధ్యక్షుడు లులా డి సిల్వ ప్రస్తుత అధ్యక్షుడు జిమ్ బాసినరోతో వచ్చే అక్టోబర్ ఎన్నికల్లో పోటీ పడుతున్నాడు. లులా ఎన్నికైతే మెక్సికో, అర్జెంటీనాలతో సహా లాటిన్ అమెరికాలోని అన్ని పెద్ద దేశాలు వామపక్షం చేతిలోకి వచ్చినట్లు అవుతుంది. వీరి విజయం ఈ కేథలిక్ ప్రాంతంలో సామాజిక మార్పు లకు పరావర్తనంలా ఉంది.

దాదాపు రెండు దశాబ్దాలకు పైగా లాటిన్ అమెరికాలోని కొలంబియా మితవాదుల అధీనంలో ఉంది. ఈ ప్రాంతంలో చాలా దేశాల్లో వామపక్ష ప్రభుత్వాలు వచ్చాయి, పోయాయి. మిత, మధ్యేవాదుల దేశంగా కొలంబియా... అమెరికాతో మంచి సంబంధాలు కలిగి ఉంది. గత నెల19న వెల్లడైన ఎన్నికల ఫలితాల్లో ఇదంతా తారుమారైంది. అక్కడ అధికారం వామపక్షాల కైవసం అయింది. అర్బన్ గెరిల్లాకు చెందిన సెనేటర్ గుస్తావ్ పెట్రో వామపక్షం తరఫున అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. లక్షలాది పేదలకు, యువతకు, అస్తిత్వానికై పోరాడే వారికి ప్రత్యామ్నాయంగా ఎన్నికయ్యాడు. ఈ విజయం ఒక తరానికి ముందు ఏ మాత్రం ఊహకందనిది. ఆరోగ్యం, ఆర్థికంపైనే కాక రాజకీయ అధికారంపైనా కోవిడ్ ఎంతటి ప్రభావం చూపగలదో నిరూపించిందిక్కడ. మహమ్మారి ఈ ప్రాంతంలో ఎక్కడా లేనంత ఎక్కువ దుష్ప్రభావం చూపింది. ఇంచుమించు కోటి 20 లక్షల మంది ప్రజలు మధ్య తరగతి నుండి క్రిందికి దిగజారిపోయారు. లాటిన్ అమెరికా ప్రజలను అధికారంలో ఉన్నవారు ఆదుకోవడంలో విఫలమయ్యారు. దీంతో అనేక దేశాల్లో వామపక్షాలు విజయం పొందాయి. ప్రతీ ఎన్నికల్లోనూ మితవాదులు కమ్యూనిస్టులని భూతాలుగా చిత్రించి భయపెడుతూ ఉండేవారు. ఇదే పెరూలోనూ జరిగింది. అక్కడ గత సంవత్సరం మార్క్సిస్టు స్కూల్ టీచర్ పెడ్రో కాస్టిల్లో గెలుపొందారు. చిలీలో విద్యార్థి నాయకుడు గారియల్ బోరిక్ వామపక్షాన్ని అధికారంలోకి తెచ్చాడు. ఇప్పుడది కొలంబియాకు విస్తరించింది. ఇక్కడ దశాబ్దాలుగా కొనసాగుతున్న గెరిల్లా పోరాటాల, అంతఃసంఘర్షణల అనంతరం పోటీకి తలపడ్డ వామపక్షాల నేతలు హత్యలకు గురైన ఉదంతాలు ఉన్నాయి. ఈసారి ఎన్నికలలో అలాంటివి సాగలేదు.

ఇప్పుడు అందరి కళ్లు బ్రెజిల్‌పై ఉన్నాయి. ఇది లాటిన్ అమెరికాలో అతి పెద్ద దేశం. అక్కడ పూర్వ అధ్యక్షుడు లులా డి సిల్వ ప్రస్తుత అధ్యక్షుడు జిమ్ బాసినరోతో వచ్చే అక్టోబర్ ఎన్నికల్లో పోటీ పడుతున్నాడు. లులా ఎన్నికైతే మెక్సికో, అర్జెంటీనాలతో సహా లాటిన్ అమెరికాలోని అన్ని పెద్ద దేశాలు వామపక్షం చేతిలోకి వచ్చినట్లు అవుతుంది. వీరి విజయం ఈ కేథలిక్ ప్రాంతంలో సామాజిక మార్పులకు పరావర్తనంలా ఉంది. అగ్రరాజ్యం అమెరికాలాంటి చోట 'అబార్షన్' హక్కులను హరిస్తున్నారు. స్వేచ్ఛకు మారుపేరుగా చెప్పుకుంటున్న అమెరికాలో 'మహిళ గర్భాన్నీ' ప్రభుత్వ ఆస్తిగా పరిగణిస్తున్నారు. ఈ ప్రాంతంలో కొలంబియా, అర్జెంటీనా, మెక్సికోలలో ఈ హక్కులకై మహిళా ఉద్యమాలు తలెత్తాయి. కొలంబియాలో హోమో సెక్సువల్ వివాహాలు జరుగుతున్నాయి. ఈ సంవత్సరం తొలినాళ్లలో చేసిన ప్రసంగంలో పెట్రో తాను చిలీ, బ్రెజిల్‌లతో ప్రగతిశీల పొత్తును ఆశిస్తున్నాను అన్నారు. లులా గెలిచి పెట్రో ఆశాభావం సఫలీకృతమైతే ఈ వ్యవస్థ శక్తివంతం, కీలకం అవుతుంది. అమెరికా పెత్తందారీతనాన్ని పక్కన పెట్టొచ్చు. బుష్, క్లింటన్ల కాలంలో లాటిన్ అమెరికాలో ఉన్నత దౌత్యవేత్తగా పని చేసిన బెర్నార్డ్ ఆరోన్సన్ మాటల్లో 'ఇది ఒకప్పటి లాటిన్ అమెరికన్ ఆధిక్యతను గుర్తుకు తెస్తుంది'. కొలంబియా శాంతి ప్రక్రియలో ప్రత్యేక దూతగా ఉన్న ఇతను పెట్రో విజయాన్ని 'కొలంబియాలో ఇదో భూకంపం' గా అభివర్ణించారు. తన విజయానంతరం ప్రసంగంలో పెట్రో తమ విదేశీ విధానంలో వాతావరణ మార్పుపై పోరాటంలో కొలంబియా అందరికన్నా ముందు ఉంటుందన్నారు. కర్బనపు వాయువుల విడుదలపై అమెరికాతో కూర్చుని చర్చించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఇలా అమెరికా లాటిన్ అమెరికాలో తన ప్రభావం నానాటికీ కోల్పోతోందని పలువురు పరిశీలకులు భావిస్తున్నారు. మరోవైపు ఉక్రెయిన్ యుద్ధం, ఇరాన్, ఉత్తర కొరియా పరిణామాలతో అమెరికా తలమునకలవుతోంది.

ఎన్నికల ద్వారా అధికార మార్పిడి ఓ నిశ్శబ్ద విప్లవం. పాలకుల పట్ల తీవ్ర వ్యతిరేకతకు, అసంతృప్తి, అసహనానికి ఓట్ల రూపంలో మౌన వ్యక్తీకరణ. ఆయా ప్రాంతాల్లో, దేశాల్లో నెలకొన్న దారుణ పరిస్థితుల్లో మంచి మార్పు కొరకు సామూహికంగా ప్రజలు ప్రదర్శించిన పరిణతి, విజ్ఞత. నూతనంగా అధికారాన్ని అందుకున్న వారిపై గల అపార ఆకాంక్షలకు, ఆశలకు ప్రత్యక్ష నిదర్శనం.

వ్యాస రచయిత రిటైర్డ్ ప్రొఫెసర్, 9247499715

స్టాన్‌స్వామికి ‘ఎల్గార్’ కార్యకర్తల ఘననివాళి

ముంబై: జార్ఖండ్‌కు చెందిన గిరిజన హక్కుల కార్యకర్త ఫాదర్ స్టాన్‌స్వామి గతేడాది జులై 5న ముంబైలోని జ్యుడిషియల్ కస్టడీలో మరణించారు. ఎల్గార్ పరిషత్ కేసులో చివరిగా అరెస్టు అయినది ఈయనే. కేసులో సహ-నిందితుల వలే జైల్లో సరైన వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడిన స్వామి ఆరోగ్యం విషమించడానికి తోడు కోవిడ్-19 సోకడంతో మృత్యుఒడికి చేరుకున్నారు. సమయానికి సరైన వైద్యం అందించని కారణంగానే స్టాన్‌స్వామి మరణించారని సహ-ఖైదీలు, న్యాయవాదులు ఆరోపించారు. ఆయన పట్ల అమానవీయ ప్రవర్తనను దుయ్యబట్టారు. సమయానికి వైద్యం అందితే స్టాన్‌స్వామి ప్రాణాలతో ఉండేవారన్నారు. స్టాన్‌స్వామి మొదటి వర్ధంతి సందర్భంగా ఆయన 11 మంది సహ-ఖైదీలంతా జైల్లో ఒకరోజు పాటు నిరాహార దీక్ష నిర్వహించారు. అధికారుల జవాబుదారీతనం లేమిని దుయ్యబట్టారు. ప్రముఖ కార్యకర్త, విద్రోహి మ్యాగజైన్ సంపాదకులు, ఎల్గార్ కేసు నిందితుల్లో ఒకరైన సుధీర్ ధవాలే తమ ఈ నిరశన వివరాలను వెల్లడిస్తూ న్యాయవాదులకు లేఖ రాశారు. ఏడాది క్రితం ఇదే రోజు ఉన్న పరిస్థితులు స్టాన్‌స్వామి మృతికి దారితీశాయి. అవే పరిస్థితులు ప్రస్తుతం జైల్లో

జైల్లో సహచర ఖైదీల దీక్ష

కొనసాగుతున్నాయని లేఖలో పేర్కొన్నారు. నాటి నిర్లక్ష్య వైఖరి నేడూ ఉందని, జైలు అధికారులు తమ విషయంలో చాలా అమానుషంగా ప్రవర్తిస్తారని న్యాయవాది నిహాల్‌సింగ్ రాథోడ్‌కు రాసిన లేఖలో ధవాలే వాపోయారు. ఇవే కారణాలతో ఒక రోజు నిరాహార దీక్షను ఎల్గార్ పరిషత్ కేసులో నిందితులంతా పాటించినట్లు ది వైర్‌కు రాథోడ్ వెల్లడించారు. నిరశన చేసిన వారిలో ధవాలేతో పాటు న్యాయవాదులు సురేంద్ర గాడ్లింగ్, అరుణ్ ఫెరేరియా, హక్కుల కార్యకర్తలు మహేశ్ రౌత్, రోనా విల్సన్, వెర్నన్ గోంజాల్వెజ్, సాగర్ గోర్ఖే, రమేశ్ గైచోర్; విద్యావేత్తలు హనీ బాబు, ఆనంద్ తేల్తుంబ్డే, జర్నలిస్టు గౌతం నవలఖ ఉన్నట్లు రాథోడ్ తెలిపారు. ఈ కేసులో తొలుత అరెస్టు అయిన వారిలో ధవాలే ఉన్నారు.

2018, జూన్ 6న అరెస్టు అయిన ఈయన జైలు నుంచి అనేక లేఖలను రాశారు. జైల్లోని దీన పరిస్థితులను, క్షీణిస్తున్న తోటివారి ఆరోగ్యం, వారికి సక్రమమైన వైద్యం కొరవడటాన్ని ఆ లేఖల్లో వివరించారు.



ముంబై శివార్లలోని తలోజా సెంట్రల్ జైల్లో స్వామితో గడిచిన చివరి దినాలను ధవాలే స్మరించుకున్నారు. జైలులో చిన్న చిన్న వస్తువుల కోసం స్వామి ఇబ్బంది పడ్డారని తెలిపారు. సిప్పర్, చేతికర్ర వంటివి ఆయనకు అందలేదని, ప్రతి దాని కోసం ఆయన పిటిషన్లు పెట్టుకోవాల్సి వచ్చేదని ధవాలే తన లేఖలో పేర్కొన్నారు. స్టాన్‌స్వామి తీవ్రంగా అనారోగ్యానికి గురైనప్పుడు ఆయనకు వైద్య సాయం అందించకుండా జైలులో నిర్బంధించి ఉంచారన్నారు. స్వామి తరపున న్యాయవాది మిహీర్ దేశాయ్ పిటిషన్ వేసిన తర్వాత ఆయనను ప్రైవేటు ఆసుపత్రికి పంపారని, అక్కడ చాలా వారాల పాటు అపస్మారక స్థితిలో ఉండి జులై 5న కన్నుమూశారని ధవాలే వెల్లడించారు. జైల్లో అమానవీయ ప్రవర్తన కారణంగానే స్టాన్‌స్వామి ఆరోగ్యం క్షీణించిందని కోర్టులో బాంబే హైకోర్టు సీనియర్ న్యాయవాది నొక్కిచెప్పారు. స్టాన్‌స్వామికి సరైన సమయంలో వైద్యం అందించలేదని అప్పటి తలోజా జైలు సూపరింటెండెంట్ కౌస్తుబ్ కుర్లేకర్, జైలు వైద్యుడు సునీల్ కాలేపై ఆరోపణలు ఉన్నాయి. కుర్లేకర్‌పై ఇదే తరహా ఆరోపణలను అనేకమంది ఖైదీలు కూడా చేశారు. తమ లేఖలను కుటుంబ సభ్యులకు, న్యాయవాదులకు ఇచ్చే ముందు సెన్సార్ చేయడమే కాకుండా స్కానింగ్, సేవ్ (నిల్వ) చేసినట్లు కుర్లేకర్‌పై ఎల్గార్ పరిషత్ కేసులో జైలుకు వెళ్లిన వారంతా గతేడాది ఆగస్టులో ఆరోపించారు. స్టాన్‌స్వామి మరణానంతరం జంషెడ్‌పూర్ జెస్యూట్ ప్రావిన్స్ (జేజేపీ) హైకోర్టులో పిటిషన్ వేసింది. హక్కుల కార్యకర్తకు క్లీన్‌చిట్ ఇవ్వడమే కాకుండా అధికారుల జవాబుదారీతనాన్ని ప్రశ్నించింది. జేపీపీ తరపున దేశాయ్ ది వైర్‌తో మాట్లాడారు. ఈ పిటిషన్‌పై ఇప్పటివరకు ఎలాంటి పురోగతి లేదన్నారు. ఆయన, స్టాన్‌స్వామి మిత్రులంతా ఈ కేసు పరిష్కారం అయ్యేంత వరకు విశ్రమించబోమని తేల్చిచెప్పారు.

ముంబైలో భారీ వర్షాలు

రహదారులు జలమయం

ముంబై: ముంబై నగరం సహా పరిసర ప్రాంతాలలో మంగళవారం భారీ వర్షాలు కురిశాయి. వర్షాల ధాటికి జనజీవనం స్థంబించింది. నగరంలోని చాలా ప్రాంతాలు జలమయమయ్యాయి. రైల్వే ట్రాక్‌లు, రహదారులుపై భారీగా నీరు చేరడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయి. ముంబై లైఫ్ లైన్‌గా గుర్తింపు ఉన్న లోకల్ గా నడిచే రైలు సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సెంట్రల్ రైల్వే, హార్బర్ కారిడార్, కుర్లా తదితర ప్రాంతాల్లోని రైల్వే ట్రాక్‌లపై వర్షపు నీరు నిలిచి రైళ్ల రాకపోకలపై ప్రభావం పడినట్టు రైల్వేశాఖకు చెందిన ప్రజా సంబంధాల అధికారి శివాజీ సుతార్ తెలిపారు. ఇదిలా ఉండగా మరో 24 గంటల పాటు ముంబై నగరం సహా శివారు ప్రాంతాల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) అంచనా వేసింది. మంగళవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో దక్షిణ ముంబైలో సగటున 95.81 ఎంఎం వర్షపాతం నమోదుకాగా, తూర్పు ముంబైలో 115.09 ఎంఎం, పశ్చిమ ప్రాంతాల్లో 116.73 ఎంఎం వర్షపాతం నమోదైనట్టు బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) అధికారులు తెలిపారు.

మధ్యంతరం వస్తే... 100కి పైగా సీట్లు మావే

శివసేన ఎంపీ సంజయ్ రౌత్

ముంబై: మహారాష్ట్రలో ఇప్పుడు మధ్యంతర ఎన్నికలు జరిగితే ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివ సేన పార్టీ 100కి పైగా సీట్లు గెలుచుకుంటుందని ఆ పార్టీ ఎంపీ సంజయ్ రౌత్ మంగళవారం తెలిపారు. తిరుగుబాటు ఎమ్మెల్యేలపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని అన్నారు. బీజేపీ, ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేపై విమర్శలు చేస్తూ, కేంద్ర సంస్థల ద్వారా ఒత్తిడి పెంచి లేదా ధన బలం ఉపయోగించి సేనను హైజాక్ చేయడం సాధ్యం కాదని ఆయన స్పష్టం చేశారు. ‘ఇప్పుడు రాష్ట్రంలో మధ్యంతర ఎన్నికలు నిర్వహిస్తే శివ సేన 100కి పైగా సీట్లు గెలుచుకుంటుంది. తిరుగుబాటు ఎమ్మెల్యేలపై ప్రజల్లో ఉన్న ఆగ్రహం పార్టీకి అనుకూలంగా ఉంది. ఒక ఎమ్మెల్యే పార్టీని వీడితే శివ సేన తన ఓటర్లను కోల్పోయినట్లు కాదు’ అని రౌత్ విలేకరులతో అన్నారు. ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే సోమవారం అసెంబ్లీలో విశ్వాస తీర్మానాన్ని నెగ్గిన తర్వాత మాట్లాడుతూ తన నేతృత్వంలోని బీజేపీ, శివ సేన కలిసి వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో 200కి పైగా సీట్లు గెలుచుకుంటాయని, అలా జరగకపోతే, తాను మళ్లీ వ్యవసాయంలోకి తిరిగి వెళతానని అన్నారు. సేన అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే కూడా మహారాష్ట్రలో మధ్యంతర ఎన్నికలు నిర్వహించాలని బీజేపీకి సవాలు విసిరారు. కాగా సంజయ్ రౌత్ కొత్తగా ఎన్నికయిన అసెంబ్లీ స్పీకర్ రాహుల్ నర్వేకర్ పై విమర్శల దాడి చేస్తూ, ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని సేన అసలైన పార్టీ అని అన్నారు. పార్టీ ఎమ్మెల్యేలపై అనర్హత వేటుపై నిర్ణయం తీసుకుంటే, అతను తన న్యాయ పట్టాని తిరిగి ఇవ్వాలని అన్నారు. నర్వేకర్ వృత్తిరీత్యా న్యాయవాది. శివ సేన ఎమ్మెల్యేలందరూ ప్రభుత్వానికి అనుకూలంగా ఓటు వేయాలని కోరుతూ షిండే శిబిరం సోమవారం విప్ జారీ చేసింది. విశ్వాస పరీక్షలో గెలిచిన తర్వాత, శివ సేన చీఫ్ విప్, షిండే విధేయుడు భరత్ గోగావాలే జారీ చేసిన విప్‌ను ఉల్లంఘించినందుకు ఉద్ధవ్ ఠాక్రే శిబిరానికి చెందిన 14 మంది శాసనసభ్యులకు షిండే వర్గం సోమవారం రాత్రి నోటీసు జారీ చేసింది. అయితే ఈ నోటీసులో సేన వ్యవస్థాపకుడు బాల్ ఠాక్రే పట్ల గౌరవంతో ఉద్ధవ్ ఠాక్రే కుమారుడు ఆదిత్య థాకరే పేరును మినహాయించారు. ‘ఇది చట్టపరమైన ప్రక్రియ. మిగిలిన 14 మంది కూడా బాలాసాహెబ్ శివ సైనికులు, అనుచరులు’ అని రౌత్ చెప్పారు. షిండే శిబిరంలో చేరిన 40 మంది తిరుగుబాటుదారులపై ఆయన నిప్పులు చెరుగుతూ, పార్టీని వీడాలనుకునే వారికి సాకు మాత్రమే కావాలని అన్నారు. సేనలో తనకు జరిగిన అన్యాయాన్ని నొక్కిచెప్పిన షిండే అసెంబ్లీలో చేసిన ప్రసంగాన్ని ప్రస్తావిస్తూ, రాష్ట్రానికి తాను చేసిన పనులను వివరించడానికి బదులు, తాను పార్టీని ఎందుకు విడిచిపెట్టాడో అనే సీఎంని సమర్థించారని రౌత్ అన్నారు. గతంలో శివ సేనపై తిరుగుబాటు చేసిన నారాయణ్ రాణే, ఛగన్ భుజ్‌బల్ కూడా పార్టీ నుంచి బయటకు వచ్చినప్పుడు షిండే మాట్లాడిన భాషనే మాట్లాడారని రౌత్ అన్నారు. ‘ఒక నాయకుడు పార్టీని విడిచిపెట్టినప్పుడల్లా, పార్టీకి ద్రోహం చేసినప్పుడల్లా, అతను అదే రకమైన సమర్థనను ఉపయోగిస్తాడు’ అని సంజయ్ రౌత్ తెలిపారు.

సేవల రంగం వృద్ధి

జూన్‌లో 59.2కి పెరుగుదల

న్యూఢిల్లీ: జూన్ నెల సేవా కార్యకలాపాలు మరింత మెరుగుపడిన తర్వాత భారతదేశ సేవల రంగం 11 సంవత్సరాలలో అత్యంత వేగవంతమైన వృద్ధిని నమోదు చేసిందని ఎస్అండ్‌పీ గ్లోబల్ ఇండియా సర్వీసెస్ పర్చేజింగ్ బిజినెస్ యాక్టివిటీ ఇండెక్స్ (పీఎంఐ) సర్వే తెలిపింది. మేలో 58.9 నుంచి జూన్‌లో 59.2కి పెరిగిందని వివరించింది.

ఏప్రిల్ 2011 నుంచి ఇది అత్యధిక మార్కు. సేవా ఆర్థిక వ్యవస్థలో వ్యయ ఒత్తిళ్లు మొండిగా పెరిగినప్పటికీ, డిమాండ్ పరిస్థితుల్లో కొనసాగుతున్న మెరుగుదలల మధ్య ఈ వృద్ధి రేటు ఏప్రిల్ 2011 నుంచి అత్యధికం అని నెలవారీ సర్వేలో తేలింది. ‘ఫిబ్రవరి 2011 నుంచి సేవలకు డిమాండ్ చాలా వరకు మెరుగుపడింది. 2022-23 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో ఈ రంగానికి బలమైన ఆర్థిక విస్తరణకు మద్దతు ఇస్తుంది’ అని ఎస్అండ్‌పీ గ్లోబల్ మార్కెట్ ఇంటెలిజెన్స్ ఎకనామిక్స్ అసోసియేట్ డైరెక్టర్ పోలియానా డి లిమా చెప్పారు. సర్వేలో భాగంగా ప్యానెల్ సభ్యుల ప్రకారం, మహమ్మారి పరిమితులు, సామర్థ్య విస్తరణ, అనుకూలమైన ఆర్థిక వాతావరణం తిరోగమనం తరువాత డిమాండ్‌లో కొనసాగుతున్న మెరుగుదలల నుంచి పెరుగుదల ఏర్పడింది. సంస్థలు తమ సేవలకు ఎక్కువ చార్జీ విధించినప్పటికీ కొత్త ఆర్డర్‌లను పొందగలిగాయి.

జూన్ గణాంకాలు జులై 2017 నుంచి అమ్మకాల ధరలలో అత్యంత వేగవంతమైన పెరుగుదలను చూపింది. అనేక కంపెనీలు తమ అదనపు వ్యయ భారంలో కొంత భాగాన్ని ఖాతాదారులకు బదిలీ చేయడానికి ప్రయత్నించాయని సర్వే వివరించింది.

కాంగ్రెస్ ఎమ్మెల్యే ఇంటిపై ఏసీబీ దాడి

బెంగళూరు: ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నాయన్న ఈడీ ఆరోపణలపై కర్ణాటకలో కాంగ్రెస్ ఎమ్మెల్యే జమీర్ అహ్మద్ ఖాన్ నివాసం, కార్యాలయాలపై అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) మంగళవారం దాడులు చేసింది. ఏసీబీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం..కంటోన్మెంట్ రైల్వేస్టేషన్ సమీపంలోని జమీర్ నివాసంలోనూ, సిల్వర్ ఓక్ అపార్టుమెంటు ఫ్లాట్‌లోనూ, సదాశివ నగర్ అతిథిగృహంలోనూ, జీకే అసోసియేషన్ కార్యాలయం, నేషనల్ ట్రావెల్స్ కార్యాలయంలో అధికారులు తనిఖీలు చేశారు. మంగళవారం ఉదయం నుంచి ఏసీబీ అధికారులు బృందాలుగా విడిపోయి విస్తృతంగా తనిఖీలు చేసినట్లు ఏసీబీ అధికారి ఒకరు చెప్పారు. జమీర్ నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. హెచ్‌డీ కుమారస్వామి ప్రభుత్వంలో ఆయన ఆహార, పౌరసరఫరాలశాఖ మంత్రిగా పనిచేశారు. రూ.4 వేల కోట్ల కుంభకోణం కేసులో గతేడాది ఆగస్టులో జమీర్ నివాసంపైనా, మరో మాజీమంత్రి ఆర్.రోషన్ బేగ్ నివాసంపైనా ఎన్‌ఫోర్సుమెంటు డైరెక్టరేట్(ఈడీ) దాడులు చేసింది. జమీర్‌ను ఈడీ అనేకసార్లు ప్రశ్నించింది. ఎస్ఐ పోస్టుల నియామక కుంభకోణం ఆరోపణల నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికే జమీర్ ఆస్తులపై ఏసీబీ దాడులు చేసినట్లు కాంగ్రెస్ విమర్శించింది. ఏసీబీ ముఖ్యమంత్రి చెప్పుచేతల్లో ఉండటం కారణంగా ప్రజల దృష్టి మళ్లించడానికే ఈ దాడులు జరిగినట్లు తాను భావిస్తున్నానని మాజీ సీఎం, ప్రతిపక్ష నేత సిద్ధరామయ్య విలేకరులకు తెలిపారు. వాస్తవంగా ఏసీబీకి, ఈడీకి ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్నారు. మరోవైపు, జమీర్ ఇంటిపై ఏసీబీ దాడులకు నిరసనగా పెద్దసంఖ్యలో కాంగ్రెస్ కార్యకర్తలు ఆయన ఇంటివద్ద నిరసనకు దిగారు.

ఉపరాష్ట్రపతి ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల

న్యూఢిల్లీ: ఆగస్టు 6వ తేదీన జరగనున్న ఉపరాష్ట్రపతి ఎన్నిక కోసం కేంద్ర ఎన్నికల కమిషన్ మంగళవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో ఉపరాష్ట్రపతి అభ్యర్థుల నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. నోటిఫికేషన్ ప్రకారం నామినేషన్ల దాఖలుకు జులై 19 చివరి తేదీ. ప్రస్తుత ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు పదవీకాలం ఆగస్టు 10వ తేదీతో ముగుస్తుంది. ఆగస్టు 11న తదుపరి రాష్ట్రపతి బాధ్యతలు స్వీకరించాల్సి ఉంటుంది. జులై 20న నామినేషన్ పత్రాల పరిశీలన, 22న నామినేషన్ పత్రాల ఉపసంహరణకు చివరి తేదీ. ఈ ఎన్నికల్లో ఉపరాష్ట్రపతి అభ్యర్థి గెలుపు కోసం ఎన్‌డీఏకు సంపూర్ణ మద్దతు ఉంది. నామినేటెడ్ సభ్యులు సహా లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు ఓటింగ్‌లో పాల్గొంటారు. ఇప్పటి వరకు రాజకీయ పార్టీలు తమ అభ్యర్థులను ప్రకటించలేదు. ఉపరాష్ట్రపతి రాజ్యసభ చైర్మన్‌గా వ్యవహరిస్తారు.

పంజాబ్ డీజీపీగా గౌరవ్ యాదవ్

చండీగఢ్: పంజాబ్ నూతన డీజీపీగా సీనియర్ ఐపీఎస్ అధికారి గౌరవ్ యాదవ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకూ డీజీపీగా ఉన్న వీకే భవ్రా రెండు నెలల పాటు సెలవు తీసుకున్న నేపథ్యంలో గౌరవ్ యాదవ్‌ను కొత్త డీజీపీగా నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో బాధ్యతలు స్వీకరించిన గౌరవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో గ్యాంగ్‌స్టర్ సంస్కృతిని నిర్మూలించడానికి, మాదకద్రవ్యాల అరికట్టడానికి కృషి చేస్తానని తెలిపారు. సీఎం ప్రాధాన్యతలు కూడా ఇవేనని పేర్కొన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలను కాపాడుతూ ఫ్రెండ్లీ పోలీసింగ్ సేవలను అందించడానికి కట్టుబడి పని చేయనున్నట్టు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా ఆప్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 1992 ఐపీఎస్ క్యాడర్‌కు చెందిన గౌరవ్ యాదవ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్‌కు ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు.

పంజాబ్‌లో కొత్త మంత్రులకు శాఖల కేటాయింపు

చండీగఢ్: మంత్రివర్గ విస్తరణలో భాగంగా కొత్తగా మంత్రివర్గంలోకి వచ్చిన ఐదుగురు మంత్రులకు పంజాబ్ సీఎం భగవంత్ మాన్ శాఖలను కేటాయించారు. ఈ సమాచారాన్ని స్వయంగా ఆయనే మంగళవారం ట్విట్టర్ వేదికగా పంచుకున్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన ఆప్ ప్రభుత్వం సోమవారం తొలిసారి మంత్రివర్గ విస్తరణ చేపట్టడంతో ఐదుగురు ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు దక్కిన విషయం తెలిసిందే. కొత్తగా మంత్రివర్గంలోకి వచ్చిన చేతన్ సింగ్ జౌరమజ్రాకు ఆరోగ్య శాఖ, అమన్ అరోరాకు గృహనిర్మాణం, పట్టణాభివృద్ధి శాఖలను కేటాయించారు. నీటిపారుదల, పార్లమెంటరీ వ్యవహారాల శాఖను డాక్టర్ ఇందర్బీర్ సింగ్ నిజ్జర్‌కు, ఫుడ్ ప్రాసెసింగ్, హార్టీకల్చర్, స్వాతంత్ర సమరయోధుల సంక్షేమ శాఖను ఫౌజా సింగ్‌కు, పర్యాటక శాఖను అన్మోల్ గగన్ మాన్‌కు కేటాయిస్తూ సీఎం నిర్ణయం తీసుకున్నారు. తాజాగా చేపట్టిన ఈ విస్తరణతో సీఎం సహా మంత్రివర్గంలోని సభ్యుల సంఖ్య 15కు చేరింది.

రైతులకు మోదీ సర్కార్ ద్రోహం

- 31న దేశవ్యాప్తంగా చక్కాజామ్
- అగ్నిపథ్‌పై ఆగస్టు 7 నుంచి 14 వరకు సదస్సులు
- ఎస్‌కేఎం జాతీయ సమావేశంలో నిర్ణయం

న్యూఢిల్లీ: కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చకుండా రైతులకు ద్రోహం చేసిందని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) విమర్శించింది. ఇందుకు వ్యతిరేకంగా దేశవ్యాప్త ఆందోళనలకు పిలుపునిచ్చింది. కనీస మద్దతు ధర, ఇతర అపరిష్కృత సమస్యలపై చట్టపరమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేసింది. ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో జరిగిన ఎస్‌కేఎం జాతీయ సమావేశంలో రైతుల ఉద్యమానికి సంబంధించి మూడు ముఖ్యమైన నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సమావేశంలో 15 రాష్ట్రాల నుంచి దాదాపు 200 మంది రైతు నేతలు పాల్గొన్నారు. పంజాబ్ ఎన్నికల సమయంలో సస్పెండ్ అయిన 16 రైతు సంఘాలు తిరిగి ఎస్‌కేఎంలో చేరేందుకు సమావేశం సమ్మతి తెలిపింది. 2021 డిసెంబరు 9న మోర్చాను ఎత్తివేసినప్పుడు రైతులకు ఇచ్చిన లిఖితపూర్వక వాగ్దానాలను ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని పేర్కొంది. ఎంఎస్‌పీపై కమిటీని ఏర్పాటు చేయలేదనీ, రైతులపై నమోదు చేసిన తప్పుడు కేసులు రద్దు చేయలేదని పేర్కొంది. విద్యుత్ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించింది. కనీస మద్దతు ధరపై చట్టపరమైన హామీని పరిగణనలోకి తీసుకోవడానికి కూడా మోదీ ప్రభుత్వం సిద్ధంగా లేదని విమర్శించింది. ప్రభుత్వం చేస్తున్న ఈ ద్రోహానికి నిరసనగా జులై 18న పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి షహీద్ ఉధమ్ సింగ్ అమరవీరుల దినోత్సవమైన జులై 31 వరకు దేశవ్యాప్తంగా జిల్లా స్థాయిలో “ద్రోహానికి వ్యతిరేకంగా నిరసన” బహిరంగ సభలు నిర్వహించనున్నట్టు ఎస్‌కేఎం తెలిపింది. ఈ ప్రచారం ముగింపులో జులై 31న దేశవ్యాప్తంగా అన్ని ప్రధాన రహదారులపై ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు చక్కా జామ్ నిర్వహించనున్నట్టు ప్రకటించింది. రైతు వ్యతిరేక, దేశ వ్యతిరేక, యువత వ్యతిరేకమైన అగ్నిపథ్ పథకానికి వ్యతిరేకంగా నిరుద్యోగ యువతను, మాజీ సైనికులను సమీకరించాలని సమావేశం నిర్ణయించింది. అగ్నిపథ్ పథకాన్ని బహిర్గతం చేయడానికి ఆగస్టు 7 నుంచి 14 వరకు దేశవ్యాప్తంగా “జై జవాన్, జై కిసాన్” సదస్సులు నిర్వహించనున్నట్టు తెలిపింది. లఖింపూర్‌ఖేరీ హత్యాకాండ జరిగిన 10 నెలల తరువాత కూడా అజయ్ మిశ్రాను కేంద్ర మంత్రివర్గంలో కొనసాగించటం దారుణమని ఎస్‌కేఎం పేర్కొంది. రైతులకు న్యాయం చేయడానికి ఎస్‌కేఎం కట్టుబడి ఉందనీ, బాధిత కుటుంబాలకు న్యాయ, ఇతర సహాయాన్ని అందిస్తోందని తెలిపింది. ఈ సమస్యను బలంగా లేవనెత్తడానికి 75వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 18 నుంచి 20 వరకు లఖింపూర్ ఖేరీలో 75 గంటల సామూహిక ధర్నాను నిర్వహిస్తామని తెలిపింది. ఇందులో దేశవ్యాప్తంగా రైతు నాయకులు, కార్మిక నేతలు పాల్గొంటారని పేర్కొంది. రైతులపై పెరుగుతున్న అణచివేత, మానవ హక్కుల ఉద్యమకారులపై దాడిపై ఎస్‌కేఎం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఉత్తరప్రదేశ్‌లోని అలహాబాద్‌లో రైతు నాయకుడు ఆశిష్ మిట్టల్‌పై తప్పుడు కేసులు బనాయించడాన్ని, బెంగాల్‌లోని ఫరక్కాలో అదానీ హైవోల్టేజీ వైర్‌కు వ్యతిరేకంగా నిరసన తెలిపిన రైతులపై లాఠీచార్జీని, ఛత్తీస్‌గఢ్‌లో నిరసన తెలిపిన రైతులపై అణచివేతను ఎస్‌కేఎం ఖండించింది. తీస్తా సెతల్వాద్, ఆర్‌బి శ్రీకుమార్, ముహమ్మద్ జుబేర్ వంటి సామాజిక కార్యకర్తలు, జర్నలిస్టుల అరెస్టులు, దేశవ్యాప్తంగా ప్రజాస్వామ్య హక్కులపై పెరుగుతున్న అణచివేతను సూచిస్తున్నాయని విమర్శించింది. ఈ ప్రజాస్వామిక పోరాటంలో ఈ కార్యకర్తలు, సంస్థలందరికీ ఎస్‌కెఎం అండగా నిలుస్తుందని తెలిపింది.

వాస్తు నిపుణుడు చంద్రశేఖర్ హత్య

హుబ్లీ: ప్రముఖ సరళ వాస్తు నిపుణుడు చంద్రశేఖర్ గురూజీ దారుణ హత్యకు గురయ్యారు. మంగళవారం హుబ్లీలోని ఒక హోటల్‌లో ఆయన్ను ఇద్దరు వ్యక్తులు కత్తితో పొడిచి హత్య చేసినట్టు పోలీసులు తెలిపారు. హోటల్ రిసెప్షన్ వద్ద ఆయనపై ఈ దాడి జరిగిందని, ఆ ఘటన అంతా అక్కడున్న సీసీ టీవీల్లో రికార్డయినట్టు తెలిపారు. హత్యకు పాల్పడిన హంతకుల కోసం గాలింపు చర్యలు చేపట్టినట్టు పేర్కొన్నారు. చంద్ర శేఖర్ హత్య విషయం తెలసిన వెంటనే స్పందించిన నగర పోలీసు కమిషనర్ లబ్బు రామ్ హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకున్నారు. పరిస్థితిని సమీక్షించారు. నిందితులను పట్టుకుంటామని తెలిపారు. బాగల్‌కోట్‌కు చంద్రశేఖర తొలుత ముంబైలో కాంట్రాక్టర్‌గా పని చేస్తూ వాస్తు శాస్త్ర నిపుణుడిగా ప్రఖ్యాతి చెందారు. మూడు రోజుల కిందట ఆయన కుంటుంబానికి చెందిన చిన్నారి మృతి చెందిన నేపథ్యంలో తదనంతర కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఆయన హుబ్లికి వచ్చినట్టు తెలుస్తోంది.

స్పైస్‌జెట్‌లో సాంకేతిక లోపం

కరాచీలో అత్యవసర ల్యాండింగ్

న్యూఢిల్లీ: ఢిల్లీ నుంచి దుబాయ్ వెళుతున్న స్పైస్‌జెట్‌కు చెందిన విమానంలో సాంకేతిక లోపం ఏర్పడడంతో ఆ విమానాన్ని అత్యవసరంగా పాకిస్తాన్ లోని కరాచీ విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండింగ్ చేసినట్టు అధికారులు తెలిపారు. ఈ విషయాన్ని పాకిస్తాన్ విమానయాన శాఖ అధికారులు ధృవీకరించారు స్పైస్‌జెట్ బీ737 ఎయిర్‌క్రాఫ్ట్ మంగళవారం ఢిల్లీ నుంచి దుబాయ్‌కు ప్రయాణిస్తూ 5 వేల అడుగుల ఎత్తులో ఇంధనాన్ని చూపించే సూచిక సరిగా పని చేయకపోవడంతో అత్యవసరంగా ల్యాండింగ్ చేయవలసి వచ్చిందని ఆ వియాన సంస్థ ప్రతినిధి తెలిపారు. విమానంలో సాంకేతిక లోపం తలెత్తిన తరుణంలో విమానం పాకిస్తాన్ గగనతలంలో ప్రయాణిస్తోందని, సమస్యను కరాచీ విమానాశ్రయ అధికారులకు తెలిపి అత్యవసర ల్యాండింగ్‌కు అవకాశం ఇవ్వాలని కోరినట్టు తెలిపారు. అక్కడి అధికారులు నుంచి అనుమతి రావడంతో అత్యవసరంగా దించినట్టు వివరించారు. ఆ విమానంలో దాదాపు 100 మంది ప్రయాణికులు ఉన్నారని తెలిపారు. ల్యాండింగ్ సమయంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తలేదని స్పైస్‌జెట్ సంస్థ తెలిపింది. ప్రయాణికులందరూ సురక్షితంగా ఉన్నట్టు తెలిపింది. ప్రయాణీకులను దుబాయ్‌కు తరలించేందుకు మరో విమానాన్ని కరాచీకి పంపుతున్నట్లు తెలిపింది.

వివో, చైనా కంపెనీలపై ఈడీ దాడులు

న్యూఢిల్లీ: చైనీస్ స్మార్ట్‌ఫోన్ తయారీ కంపెనీ వివో, సంబంధిత సంస్థలపై మనీలాండరింగ్ దర్యాప్తులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) మంగళవారం దేశవ్యాప్తంగా 44 చోట్ల సోదాలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ) సెక్షన్ల కింద ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, మేఘాలయ, మహారాష్ట్ర, ఇతర రాష్ట్రాలతో సహా అనేక రాష్ట్రాల్లోని ప్రదేశాలలో సోదాలు జరుగుతున్నాయి. వివో, అనుబంధ కంపెనీలకు సంబంధించిన 44 చోట్ల ఏజెన్సీ సోదాలు నిర్వహిస్తోందని వారు వివరించారు. ఈ విషయమై వివో స్పందించలేదు. జమ్ముకశ్మీర్‌లో ఉన్న ఏజెన్సీ పంపిణీదారుపై ఇటీవల ఢిల్లీ పోలీసు (ఆర్థిక నేరాల విభాగం) ఎఫ్ఐఆర్‌ను పరిగణనలోకి తీసుకున్న తర్వాత కేంద్ర దర్యాప్తు సంస్థ (ఈడీ) మనీలాండరింగ్ కేసును దాఖలు చేసింది. ఆ కంపెనీలోని కొంతమంది చైనా వాటాదారులు తమ గుర్తింపు పత్రాలను నకిలీ చేశారని ఆరోపించారు. షెల్ లేదా పేపర్ కంపెనీలను ఉపయోగించి చట్టవిరుద్ధంగా సంపాదించిన నిధులను లాండరింగ్ చేయడానికి ఈ ఆరోపించిన ఫోర్జరీ జరిగిందని ఈడీ అనుమానిస్తోంది. ఈ ‘నేర ఆదాయాలు’ కొన్ని విదేశాలకు మళ్లించబడ్డాయి లేదా భారత పన్ను సంస్థలను తప్పించడం ద్వారా కొన్ని ఇతర వ్యాపారాలలో ఉంచినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇక్కడ కార్యకలాపాలు నిర్వహిస్తున్నప్పుడు మనీలాండరింగ్, పన్ను ఎగవేత వంటి తీవ్రమైన ఆర్థిక నేరాలకు పాల్పడుతున్న చైనా సంస్థలు, వారితో అనుసంధానమై ఉన్న భారత సంస్థలపై కేంద్ర ప్రభుత్వం నిరంతర అణిచివేతలో భాగంగా ఈ చర్య ఉంది. గత ఏడాది డిసెంబరులో అనేక మంది చైనీస్ స్మార్ట్‌ఫోన్ తయారీదారులు, వారి పంపిణీదారులు, అనుసంధాన సంస్థల ప్రాంగణాలపై ఆదాయపు పన్ను శాఖ దేశవ్యాప్తంగా దాడి చేసింది. భారత పన్ను చట్టం, నిబంధనల ఉల్లంఘనల కారణంగా రూ.6,500 కోట్లకు పైగా విలువైన లెక్కల్లో చూపని ఆదాయాన్ని గుర్తించినట్లు పేర్కొంది.

జీ-20 సమావేశాల పర్యవేక్షణకు కమిటీ

భోపాల్: మధ్యప్రదేశ్‌లోని ఇండోర్, భోపాల్‌లో జీ-20 దేశాల సమావేశాలు జరగనున్నాయి. ఈ సమావేశాలకు వచ్చే అతిథులకు ఆతిథ్యం, భద్రత అంశాలను పరిశీలించడానికి ఎంపీ ప్రభుత్వం ఉన్నతాధికారులతో అత్యున్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. కమిటీకి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వం వహిస్తారని అధికారి ఒకరు మంగళవారం చెప్పారు. ఈ కమిటీ విదేశీ ప్రతినిధులకు సంబంధించిన భద్రతా ఏర్పాట్లు, ఆతిథ్యం అంశాలను పరిశీలిస్తుందని తెలిపారు. అయితే, ఈ సమావేశాలు ఎప్పుడు జరుగుతాయో ఆ అధికారి వెల్లడించలేదు. సాధారణ పరిపాలన, హోంశాఖ అదనపు చీఫ్ సెక్రటరీలతో పాటు ఇతర సీనియర్ అధికారులు కమిటీ సభ్యులుగా ఉంటారు. కమిటీ కార్యదర్శిగా, నోడల్ అధికారిగా పర్యాటకశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వ్యవహరిస్తారు.

గవర్నరును కలిసిన అజిత్ పవార్

ముంబై: మహారాష్ట్ర అసెంబ్లీలో ప్రతిపక్ష నేత అజిత్ పవార్ మగళవారం గవర్నర్ భగత్‌సింగ్ కొశ్యారీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఉద్ధవ్ ఠాక్రే ప్రభుత్వంలో పవార్ ఉప ముఖ్యమంత్రిగా పనిచేశారు. శివసేన ఎమ్మెల్యే ఏక్‌నాథ్ షిండే సొంతపార్టీపై జూన్‌లో తిరుగుబాటు చేసిన విషయం విదితమే. శివసేన మెజారిటీ ఎమ్మెల్యేలు ఆయన చెంతకు చేరారు. దీంతో శివసేన, ఎన్‌సీపీ, కాంగ్రెస్ సంకీర్ణ ప్రభుత్వం మహా వికాస్ అఘాడీ కుప్పకూలింది. జూన్ 30న షిండే సీఎంగా, దేవేంద్ర ఫడ్నవిస్ డిప్యూటీ సీఎంగా ప్రమాణం చేశారు. ప్రతిపక్ష నేతగా అజిత్ పవార్ పేరును సోమవారమే ప్రకటించారు. ప్రతిపక్ష నేతగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మర్యాదపూర్వకంగా రాజ్‌భవన్‌లో గవర్నరును కలిసినట్లు పవార్ ట్వీట్ చేశారు. 288 మంది సభ్యులు గల అసెంబ్లీలో ఎన్‌సీపీ అతిపెద్ద ప్రతిపక్ష పార్టీగా ఉందని స్పీకర్ రాహుల్ నర్వేకర్ సోమవారం ప్రకటించారు. అజిత్ పవార్‌ను పరిపక్వత చెందిన రాజకీయ నేతగా, పాలనాదక్షుడిగా సీఎం షిండే అభివర్ణించారు.

దళితులు, గిరిజనులపై బీజేపీ అకృత్యాలు: ప్రియాంక

న్యూఢిల్లీ: బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దళితులు, గిరిజనులపై దాడులు పెరిగాయని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీ విమర్శించారు. ఆ వర్గాలపై భయానక దాడులు జరుగుతున్నా పాలక పార్టీ ఎందుకు మౌనం వహిస్తోందని ఆమె మంగళవారం ప్రశ్నించారు. మధ్యప్రదేశ్‌లోని గుణ జిల్లాలో ఆస్తుల వివాదంలో ఓ గిరిజన మహిళను మంటల్లో దహనం చేయడం, యూపీలోని లక్నో జిల్లాలో ఓ దళిత యువకుడిని పేలుడు పదార్థాలు ఉపయోగించి దారుణంగా చంపడం వంటి ఘటనలను ప్రియాంక ఉదహరించారు. ఈ రెండు ఘటనలను ఆమె ట్విట్టర్ ద్వారా వెల్లడించారు. ఎన్నికల్లో దళితులు, ఆదివాసీల పాట పాడుతున్న బీజేపీ..వారిపై దాడులు జరుగుతుంటే ఎందుకు స్పందించడం లేదని ప్రియాంక నిలదీశారు.

ఆజంఖాన్ భార్య, కుమారుడికి ఈడీ సమన్లు

న్యూఢిల్లీ: మనీలాండరింగ్ కేసులో సమాజ్‌వాదీ పార్టీ నేత ఆజంఖాన్ భార్య, తనయుడికి ఎన్‌ఫోర్సుమెంట్ డైరెక్టరేట్(ఈడీ) మంగళవారం సమన్లు జారీ చేసింది. ఈ కేసులో ఇప్పటికే ఆజంఖాన్‌పై ఈడీ దర్యాప్తు చేసింది. 73 ఏళ్ల ఆజంఖాన్ రాంపూర్ అసెంబ్లీ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆయన తనయుడు అబ్దుల్లా ఆజంఖాన్ కూడా ఎమ్మెల్యేగా పనిచేస్తున్నారు. లక్నోలోని తమ కార్యాలయంలో వేర్వేరుగా తమ వాంగ్మూలాలు ఇవ్వాల్సిందిగా అబ్దుల్లా, ఆజంఖాన్ భార్య తజీన్ ఫాత్మాను ఈడీ ఆదేశించింది. ఇదే కేసులో ఆజంఖాన్ జైలుకెళ్లి ఇటీవల బెయిల్‌పై విడుదలయ్యారు.

పెరుగుతున్న కోవిడ్ కేసులు

కొత్తగా 13,086 బాధితులు

న్యూఢిల్లీ: భారత్‌లో కోవిడ్ దశలవారీ విజృంభణ కొనసాగుతూనే ఉంది. తాజాగా 13,086 కేసులు నమోదు కాగా క్రియాశీల కేసుల సంఖ్య 1,14475కు పెరిగింది. దేశంలో మొత్తం కేసుల సంఖ్య 4,35,31,650కు చేరింది. తాజాగా 19 మంది మృత్యువాత పడగా వీరిలో ముగ్గురు మహా రాష్ట్రలో, ఇద్దరు చొప్పున కేరళ, పంజాబ్, రాజస్థాన్‌లో చనిపోయారని కేంద్ర ఆరోగ్యశాఖ తాజా నివేదిక పేర్కొంది. దీంతో మొత్తం మృతుల సంఖ్య 5,25,242కు పెరిగింది. 24 గంటల్లో యాక్టివ్ కోవిడ్ కేస్‌లోడ్‌లో 611 కేసులు రికార్డు అయింది అని పేర్కొంది. క్రియాశీలత రేటు 0.26శాతంగా ఉంటే రికవరీ రేటు 98.53 శాతంగా ఉన్నట్లు వెల్లడించింది. ఇప్పటి వరకు మొత్తం 86.44 కోట్ల కోవిడ్ పరీక్షలు జరుగగా 24 గంటల్లో 4,51,312 టెస్టులు చేసినట్లు పేర్కొంది. దినసరి క్రియాశీలత 2.90 శాతంగా ఉంటే వారంతపు క్రియాశీలత 3.81శాతంగా ఉందని తెలిపింది.

ఉగ్రవాదితో బీజేపీ బంధం

జమ్ములో పీడీపీ భారీ నిరసన

జమ్ము: లష్కరే తోయిబా ఉగ్రవాదులతో బీజేపీకి సంబంధాలపై జమ్ముకశ్మీరు అట్టుడు కుతోంది. కరుడు గట్టిన లష్కరే తోయిబా ఉగ్రవాది తలీబ్ హుస్సేన్‌తో కాషాయపార్టీకి సంబంధాలు ఉన్నట్లు పెద్దఎత్తున ఆరోపణలు వెల్లువెత్తాయి. టెర్రరిస్టుతో బీజేపీకి బంధంపై పీడీపీ మంగళవారం భారీ నిరసన ప్రదర్శన చేపట్టింది. ఎలాంటి తనిఖీలు లేకుండా ఉగ్రవాది హుస్సేన్ ప్రవేశానికి సహకరించిన బీజేపీ నాయకత్వంపై అత్యున్నస్థాయి విచారణ చేపట్టాలని పీడీపీ డిమాండ్ చేసింది. పీడీపీ ప్రధాన కార్యదర్శి అమ్రిక్ సింగ్ రీన్ నాయకత్వంలో ఆ పార్టీ కార్యకర్తలు గాంధీనగర్‌లోని పార్టీ ప్రధాన కార్యాలయం నుంచి ప్రదర్శన చేపట్టారు. లష్కరే ఉగ్రవాదితో బీజేపీ నాయకత్వానికి సంబంధం ఏమిటని నిలదీశారు. తప్పుడు ప్రకటనలతో బీజేపీ నాయకులు ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని, వాస్తవం ఏమిటంటే హుస్సేన్ బీజేపీ క్రియాశీల సభ్యుడని పీడీపీ అధికార ప్రతినిధి వరేంద్రసింగ్ సోను చెప్పారు. మైనారిటీ మోర్చా విభాగం ఐటీ, సోషల్ మీడియా ఇన్‌చార్జిగా పనిచేస్తున్నాడని తెలిపారు. సంబంధం లేకపోతే కేంద్రమంత్రి అమిత్‌షా సమావేశంలో హుస్సేన్ ఎలా ఉన్నారని సోను ప్రశ్నించారు. హుస్సేన్, ఆయన అనుచరుడు ఫైసల్ అహ్మద్ దార్‌లను ఆదివారం గ్రామస్తులు చితకబాది పోలీసులకు అప్పగించారు. వారి నుంచి రెండు ఏకే 47, పిస్టల్, ఏడు గ్రనేడ్లు, పెద్దమొత్తంలో పేలుడు పదార్థాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బీజేపీ నాయకులతో హుస్సేన్ ఫొటోలు తీసుకున్న చిత్రాలు సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేశాయి. స్వయానా బీజేపీ జమ్ముకశ్మీరు అధ్యక్షుడు రవీందర్ రైనాకు హుస్సేన్ బొకే అందజేస్తున్న ఫొటో వైరల్ అయింది. జమ్ము ప్రావిన్స్‌కు సంబంధించి మైనారిటీ మోర్చా ఐటీ, సోషల్ మీడియా ఇన్‌చార్జిగా హుస్సేన్‌ను నియమిస్తూ మే 9వ తేదీన బీజేపీ నాయకుడు షేక్ బషీర్ లేఖ ఇచ్చిన విషయం బహిర్గతమైంది. మరోవైపు, హుస్సేన్ పార్టీ క్రియాశీల సభ్యుడంటూ చేస్తున్న ప్రచారాన్ని బీజేపీ తోసిపుచ్చింది. న్యూస్ పోర్టల్ జర్నలిస్టుగా హుస్సేన్ తనకుతాను పరిచయం చేసుకున్నాడని నమ్మబలుకుతోంది.

సరళీకృత జీఎస్టీ, పన్ను శ్లాబుల్లో తగ్గింపు అవశ్యం : సీఐఐ

న్యూఢిల్లీ: వస్తువులు, సేవల పన్ను విధానాన్ని సరళీక రించాలని, విద్యుత్‌తో పాటు ఇంధనాన్ని జీఎస్టీ పరిధిలోకి తేవాలని, తద్వారా పారిశ్రామిక పోటీ పెరుగుతుందని సీఐఐ అధ్యక్షుడు సంజీవ్ బజాజ్ మంగళవారం అన్నారు. జీఎస్టీ శ్లాబులను మూడుకు కుదించాలని కూడా ఆయన కేంద్రానికి సూచించారు. విలాసవంత వస్తువులపై అత్యధిక జీఎస్టీ విధింపు సమర్థనీయమేగానీ పన్నులను మూడు శ్లాబులుగా కుదించడం సబబుగా ఉంటుందని తెలిపారు. జీఎస్టీ అమల్లోకి వచ్చిన ఈ ఐదేళ్ల అనుభవంతో ఆ దిశగా చర్యలు చేపట్టాలని బజాజ్ ఫిన్‌సర్వ్ లిమిటెడ్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ బజాజ్ కోరారు. ద్రవ్యోల్బణాన్ని చూసినట్లు అయితే ఇంధనం, ఆహారంతోనే ఎక్కువ ప్రభావం కనిపిస్తుంది. ఈసారి వర్షాలు బాగా పడి సాగు అధికమవు తుందని ఆశిస్తున్నాం. అలా జరిగితే కనీసం ఆహార ధరలైనా దిగొస్తాయి. ఇక ఇంధనం విషయంలో అస్థిరత కొనసాగుతోంది. ధరలను నియంత్రించాల్సిన అవసరం ఉంది అని బజాజ్ అన్నారు. సామర్థ్య వినియోగం 74-75శాతానికి చేరుకుందని, మరిన్ని పెట్టుబడులు లాజిస్టిక్స్, రసాయనాలు, నిర్మాణ రంగాల్లో అవసరమని చెప్పారు. చాలా దేశాలతో పోల్చితే భారత్ పరిస్థితి మెరుగ్గా ఉందన్న ఆయన క్రమంగా వృద్ధి నమోదవుతుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. కాగా, 2021-22 జనవరి -మార్చి త్రైమాసికంలో భారతీయ జడీపీ 4.1శాతంగా ఉంటే వార్షిక వృద్ధి 8.7శాతంగా ఉంది.

ఆధార్ డేటా లీకైతే చర్యలు తప్పవ్

ఎన్నికల అధికారులకు ఈసీ హెచ్చరిక

న్యూఢిల్లీ: నకిలీలకు చెక్ పెట్టేందుకు ఓటర్ల జాబితాతో ఆధార్ అనుసంధానికి ఆమోదం లభించిన క్రమంలో ఎన్నికల కమిషన్ స్పందిం చింది. ఓటర్ల జాబితాలను అనుసంధానం చేసే క్రమంలో వ్యక్తుల ఆధార్ వివరాలు లీకైతే మాత్రం ఉపేక్షించేది లేదని అధికారులకు తేల్చిచెప్పింది. అలా జరిగితే క్రమశిక్షణా చర్యలను తీసుకుంటా మని తెలిపింది. ఆధార్ ఇవ్వాలా వద్దా అన్నది ఓటర్లకే వదిలేయాలని అని సూచించింది. ఈ మేరకు లేఖను అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రధాన ఎన్నికల అధికారులకు పంపింది. ఎన్నికల సంఘం సమీక్ష సమయంలో ప్రత్యేక ప్రచార తేదీలకు అనుగుణంగా క్లస్టర్ స్థాయిలో ప్రత్యేక శిబిరాలను నిర్వహించవచ్చునని తెలిపింది. ఫారం-6బీలో తమ ఆధార్ వివరాలను ఓటర్లు స్వచ్ఛందంగా నమోదు చేయొచ్చునని పేర్కొంది. ఈ ఫారాలను వినియోగించి తమ ఆధార్‌నంబర్‌ను ఎన్నికల అధికారులతో ప్రస్తుత ఓటర్లు పంచుకోవచ్చునని న్యాయశాఖ నోటిఫికేషన్ పేర్కొంది. ప్రజాప్రాతినిధ్య చట్టం, 1950లోని 23 సెక్షన్‌లోని సబ్ సెక్షన్ (5) ద్వారా కల్పించిన అధికారాలను వినియోగించుకుంటూ కేంద్ర ప్రభుత్వం 2023, ఏప్రిల్ 1 నుంచి ఓటర్ల జాబితాలను ఆధార్‌తో ఓటర్లు అనుసంధానం చేయొచ్చు అని నోటిఫికేషన్ వెల్లడించింది. నోటిఫికేషన్‌లో 'మే' అనే పదాన్ని వాడారు... 'షల్' అని కాదు. అంటే ఓటర్లు ఆయా వివరాలను ఇవ్వాలో వద్దో నిర్ణయించుకోవచ్చు అని సీనియర్ అధికారి ఇటీవల వెల్లడించారు.



Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.